సంపుటి : 9
సంచిక : 337
శనివారం
29 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వంవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
తాజా వార్తలు మరియు విశ్లేషణలు
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ ఫోన్‌లో మా డిజిటల్ దినపత్రికను పొందండి.
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

### డబ్బుతో గెలవాలని చూసే వారికి

# ఓటమి తప్పదు



- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక

**మంగళగిరి, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన మిగతా .. 2లో..

### పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..

# చర్చకు నేను రెడీ

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య



**ఒంగోలు, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** "జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి మిగతా .. 2లో..

## సోనియా ఆత్మకథపై వివాదం

ఆ పుస్తకాన్ని మేం ప్రచురించడం లేదు

పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రకటన

మోదీ ప్రభుత్వ ఒత్తిడే కారణమని కాంగ్రెస్ నేతల ధ్వజం




**ఢిల్లీ, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకానికి భారత్‌లో తాము ప్రచురణకర్తలం కాదని 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా'(పీఆర్‌హెచ్‌ఐ) వెల్లడించింది. ఈ పుస్తకాన్ని మిగతా .. 2లో..

## స్థానిక ఎన్నికలకు 30 రోజుల ప్రణాళిక

ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామాల్లో ఎన్నికలకు పార్టీ సిద్ధం

ఎక్కడ పోటీ చేయాలో పవన్ కల్యాణ్ చూస్తారు - జనసేన ఆత్మీయ సమావేశంలో మంత్రి మనోహర్

**అమరావతి, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ సిద్ధంగా ఉందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఈ ఎన్నికల కోసం పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 30 రోజుల ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. ఆ నెల రోజులూ అందరం పూర్తి అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో పవన్‌కల్యాణ్ పాల్గొంటారని, రాష్ట్ర వ్యాప్తంగా సభలూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళగిరిలో శుక్రవారం మనోహర్ అధ్యక్షతన జనసేన పార్టీ 'స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ' సమావేశం, జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాలు వేర్వేరుగా జరిగాయి. ఆత్మీయ సమావేశంలో భాగంగా 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో, 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన అభ్యర్థులను సత్కరించారు. సమావేశాల్లో మనోహర్ మాట్లాడుతూ 'కూటమిలో మనం బాధ్యతతో వ్యవహరించాలి. మనలో ఎవరైనా పొరపాటున మాట్లాడితే దాన్ని అంతిమంగా పవన్ కల్యాణ్‌కు, జనసేనకే ఆపాదిస్తారు. అందుకే అధ్యక్షుడి నిర్ణయాల కోసం



వేచిచూడండి. తొందరపడొద్దు. పొత్తులో భాగంగా ఎక్కడ పోటీ చేస్తాం? ఏ ప్రాంతాల నుంచి పార్టీ ముందుకెళ్లాలి అనేదానిపై తెదేపా, భాజపా నాయకులతో పవన్‌కల్యాణ్ చర్చించి ఎక్కడా మన గౌరవం తగ్గకుండా, పోరాట స్ఫూర్తిని కాపాడేలా చూస్తారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం జెండా మోసినవారు, మిగతా .. 2లో..

## యానాం రేవులో పులస సందడి

గోదావరి జిల్లాల్లో మొదలైన పులస చేపల సీజన్

యానాం వేలంలో రెండు చేపలకు రికార్డు ధర

మొత్తం రూ. 31,500కు పులసలను దక్కించుకున్న మహిళ

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తగ్గిన పులస లభ్యత

అరుదుగా దొరకడంతో ఆకాశాన్నంటుతున్న ధరలు



**యానాం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి జిల్లాల్లో పులస చేపల సీజన్ మొదలైంది. తాజాగా మత్స్యకారుల వలకు చిక్కిన రెండు పులస చేపలు వేలంలో రికార్డు ధర పలికాయి. యానాం రేవులో జరిగిన వేలంపాటలో ఈ రెండు చేపలను కలిపి ఓ మహిళ ఏకంగా రూ. 31,500కు కొనుగోలు చేశారు. వివరాల్లోకి వెళితే.. మిగతా .. 2లో..

### గోదావరి నదిలో దూకి

## ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు

వంతెనపై మూడేళ్ల కుమారుడిని ఒంటరిగా వదిలేసిన వైనం

భీమవరానికి చెందిన దొడ్డ సాయి, శిరీషగా గుర్తింపు

బాలుడిని సంరక్షణలోకి తీసుకుని, గాలింపు చేపట్టిన పోలీసులు

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అధికారులు

**రాజమహేంద్రవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కన్నప్రేమను కాదనుకుని ఓ జంట తీసుకున్న కఠిన నిర్ణయం తీవ్ర విషాదాన్ని నింపింది. తమ మూడేళ్ల కుమారుడిని గోదావరి నది బ్రిడ్జిపై ఒంటరిగా వదిలేసి, దంపతులు నదిలోకి మిగతా .. 2లో..

## బలమైన వాదనలు వినిపించండి

కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట మన అవసరాలు చెప్పండి

ఉమ్మడి ఏపీకిచ్చిన 811 టీఎంసీలపైనే ప్రధాన దృష్టి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

అంతర్రాష్ట్ర జల వివాదాలు, సుప్రీంకోర్టులో కేసులపై చర్చ



**హైదరాబాద్, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ నీటి అవసరాలకు తగ్గట్లుగా బలమైన వాదనలు వినిపించాలని, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై ఎక్కువ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని మిగతా .. 2లో..

### నేపాల్ వరదల్లో

## తెలుగు ఎన్నారై కుటుంబం గల్లంతు

లండన్‌లో స్థిరపడ్డ సంతోష్ కుమార్ కుటుంబం - వీరి స్వస్థలం విజయనగరం జిల్లా పార్వతీపురం

మానస సరోవర్ యాత్రకు వెళుతుండగా విరుచుకుపడ్డ వరద



**ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య శుక్రవారం మధ్యాహ్నానికి 469కి చేరుకోగా, ముప్పు ఇంకా తొలగిపోలేదని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు, విజయనగరం జిల్లా పార్వతీపురం పట్టణానికి మిగతా .. 2లో..

## అంబటి రాంబాబుకు అస్వస్థత



హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స

వైద్య పరీక్షల అనంతరం స్టెంట్ అమర్చిన డాక్టర్లు

ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి

ఆందోళన వద్దని స్పష్టం చేసిన వైద్యులు

**గుంటూరు, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, మిగతా .. 2లో..

### గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా

## బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు - కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి

**మంగళగిరి, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు మిగతా .. 2లో..




## నార్వే రాజు కన్నుమూత



**స్టవాంజర్, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** నార్వే రాజు ఐదవ హరాల్డ్ శుక్రవారం మరణించారు. ఆయనకు 89 సంవత్సరాలు. దేశ రాజధాని ఓస్లోలోని జాతీయ ఆస్పత్రిలో ఉదయం ఆయన 6.35కు తుదిశ్వాస విడిచారని రాజభవనం వర్గాలు తెలియజేశాయి. నార్వేలో రాచరికాన్ని ఆధునీకరించిన రాజుగా ఖ్యాతి గడించిన హరాల్డ్ వార్ధక్యం, తత్సంబంధమైన సమస్యలు మీదపడినా సింహాసనాన్ని వీడలేదు. హరాల్డ్ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019-24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## చర్చకు నేను రెడీ

చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

## సోనియా ఆత్మకథపై వివాదం

నవంబరు 10న విడుదల చేయనున్నట్లు అమెరికాకు చెందిన పెంగ్విన్ రాండమ్ హౌస్ అనుబంధ విభాగం 'ఆల్ఫ్రెడ్ ఎ నాఫ్' ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. సోనియా ఆత్మకథ ప్రచురణ విషయంలో పీఆర్‌హెచ్‌ఐ వెనక్కి తగ్గిందని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. 'పుస్తకంలో ఎడిటోరియల్ మార్పులకు రచయిత్రి తిరస్కరించినందునే సోనియా ఆత్మకథను ప్రచురించకూడదని మేము నిర్ణయించుకున్నామని వచ్చిన వార్తలు అవాస్తవం' అని శుక్రవారం నాటి ప్రకటనలో పీఆర్‌హెచ్‌ఐ పేర్కొంది. పుస్తక ప్రచురణకు తాము ఆసక్తిగానే ఉన్నామంటూనే... 'రచయితలు ఇచ్చే సమాచార వాస్తవ నిర్ధారణ, పుస్తకానికి ఉపయోగపడే సిఫార్సులు చేయడమన్నది ప్రచురణకర్త బాధ్యత, విధి' అని తెలిపింది. సోనియా ఆత్మకథ పుస్తకం ప్రచురణ విషయంలో మోదీ ప్రభుత్వ ఒత్తిడికి 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా' లొంగిపోయిందని కాంగ్రెస్‌పార్టీ నేతలు ధ్వజమెత్తారు. ఇది భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హత్య చేయడమేనంటూ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ హయాంలో భారత భూభాగాలను చైనా ఆక్రమించడం, ఆరెస్సెస్ తదితర అంశాలపై మార్పులు చేయడానికి సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణకు పీఆర్‌హెచ్‌ఐ వెనకడుగు వేసిందని ఆరోపించారు.

**అమెజాన్‌లో ఈ-బుక్**

భారత్‌లో 'బిలాంగింగ్' పుస్తక పంపిణీదారు ఎవరనే విషయమై స్పష్టత రానప్పటికీ..ఈ-బుక్ వెర్షన్ రూ.2,615కు ప్రీ ఆర్డర్ కోసం అందుబాటులో ఉన్నట్లు అమెజాన్ ఈ-కామర్స్ వెబ్‌సైట్ చూపిస్తోంది. ఈ వెబ్‌సైట్ ప్రకారం..సోనియా గాంధీ ఆత్మకథ 'ఈ-బుక్'ను బ్రిటన్‌కు చెందిన హార్పర్ కాలిన్స్ అనుబంధ విభాగం విలియం కాలిన్స్ ప్రచురించింది.

## యానాం రేవులో పులస సందడి

మత్స్యకారులకు 1.300 కేజీల బరువున్న రెండు పులస చేపలు చిక్కాయి. వీటికి నిర్వహించిన వేలంలో మత్స్యకార మహిళ పార్వతి పాల్గొన్నారు. ఒక చేపను రూ. 24,000కు, మరొకటి రూ. 7,500కు, మొత్తం రూ. 31,500కు ఆమె దక్కించుకున్నారు. ఈ ఏడాది మగ పులసకు ఇంత భారీ ధర పలకడం ఇదే తొలిసారని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం దొరికిన 1.250 కేజీల పులస రూ. 14,000 పలికింది. ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంగా పులసల లభ్యత గణనీయంగా తగ్గింది. ఎల్‌నినో ప్రభావంతో గోదావరికి వరదలు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణం. సాధారణంగా జులై, ఆగస్టు నెలల్లో గోదావరికి ఎర్ర నీరు వచ్చినప్పుడు పులసల రాక మొదలవుతుంది. కానీ, ఈసారి వరదలు ఆలస్యం కావడంతో చేపలు చాలా తక్కువగా వలకు చిక్కుతున్నాయి. దీంతో వీటికి డిమాండ్ పెరిగి, వేలంలో ధరలు ఆకాశాన్నంటున్నాయి. సముద్రంలో ఉండే ఇలస చేప, గుడ్లు పెట్టేందుకు గోదావరి ప్రవాహానికి ఎదురీదుతుంది. ఈ క్రమంలోనే అది పులసగా మారుతుంది. దీని రుచి అద్భుతంగా ఉండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పులస కోసం గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అరుదుగా దొరకడం, అమోఘమైన రుచి కారణంగానే దీనికి ఇంతటి డిమాండ్ ఏర్పడింది.

## స్థానిక ఎన్నికలకు 30 రోజుల ప్రణాళిక

2014 నుంచి జనసేన సిద్ధాంతాలను నమ్ముకుని పనిచేసిన వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకత్వం ఇచ్చేందుకు పార్టీ సిద్ధమవుతోంది' అని చెప్పారు. ప్రధానాంశాలివి.

**100 శాతం స్ట్రైక్ రేటు సాధించాలి**

'రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేటు సాధించాలనేది పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సంకల్పం. ఆ దిశగా ముందుకెళ్దాం. తొలుత నగరపాలక, పురపాలక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించి డివిజన్లు, వార్డుల పరిధిలో పార్టీ బలాబలాలను గుర్తించాలి. రాష్ట్ర స్థాయిలో కూటమి పార్టీల సమన్వయ కమిటీ చర్చలు జరుగుతున్నాయి. జిల్లా, నియోజకవర్గాల స్థాయిల్లోనూ సమన్వయ కమిటీలు ఉంటాయి. జనసేన పార్టీ 'స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ' సభ్యులకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగిస్తాం. వారు క్షేత్రస్థాయికి వెళ్లి క్యాడర్‌ను కలిసి ఎన్నికలకు సమాయత్తం చేయాలి. మీ కోసం మేమున్నాం.. పొత్తులు, సమస్యలు, ఇతర పార్టీలతో చర్చల విషయంలో ఆందోళన పడొద్దు. మంగళగిరికి వెళ్లాల్సిన అవసరం లేదు. జిల్లా కార్యాలయంలో మేం అందుబాటులో ఉంటామనే నమ్మకం, భరోసా శ్రేణుల్లో కల్పించాల్సిన బాధ్యత స్థానిక ఎన్నికల కమిటీ సభ్యులపై ఉంది.

**పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా యువజన విభాగం ఏర్పాటు**

పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 2న జనసేన యువజన విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించి వారిలో బాధ్యత పెంచేలా యువజన విభాగం పనిచేస్తుంది. సెప్టెంబరు 2న ఉదయం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహిస్తాం. పవన్‌కల్యాణ్ యువజన విభాగాన్ని ఆవిష్కరించి, ప్రసంగిస్తారు. నియోజకవర్గాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసుకుని ప్రతి ఒక్కరూ ఈ సందేశాన్ని వినాలి' అని మనోహర్ చెప్పారు. సమావేశాల్లో మరో మంత్రి దుర్గేష్, ఎంపీలు బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్, లింగమనేని రమేష్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**వైకాపా హయాంలో స్థానిక ఎన్నికల్లో అరాచకాలకు ఎదురొడ్డి..**

2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని అధికార వైకాపా దుర్మార్గాలకు తెగబడింది. నామినేషన్ వేయనివ్వకుండా అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో అడ్డుకుంది. అప్పట్లో పోలీసులే జీపుల్లో వచ్చి మరీ మన పార్టీ అభ్యర్థులను తీసుకెళ్లిపోయారు. అప్పట్లో వైకాపా సిద్ధమంటే.. యుద్ధమెలా ఉంటుందో మనం చూపించాం. అక్రమ కేసులు పెట్టినా, ఆస్తులు ధ్వంసం చేసినా, గృహనిర్బంధాలు చేసినా జనసేన శ్రేణులు వెనక్కి తగ్గలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తరఫున ఇద్దరు జడ్పీటీసీ, 177 మంది ఎంపీటీసీ సభ్యులు, 1,209 మంది సర్పంచులు, 1576 మంది ఉప సర్పంచులు, 4456 మంది వార్డు సభ్యులు గెలిచారు. ఆ స్ఫూర్తికి గౌరవమిచ్చేలా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జనసేన నిలబడుతుంది.

## అంబటి రాంబాబుకు అస్వస్థత

స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు

దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన పశ్చిమ గోదావరి జిల్లాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, భీమవరానికి చెందిన దొడ్డ సాయి (29), దొడ్డ శిరీష (28) దంపతులు గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తమ మూడేళ్ల కుమారుడితో కలిసి స్కూటర్‌పై గోదావరి నదిపై ఉన్న వంతెన వద్దకు చేరుకున్నారు. అనంతరం, కన్నకొడుకును అక్కడే వదిలేసి, ఇద్దరూ నదిలోకి దూకేశారు. వంతెనపై పసిబాలుడు ఒంటరిగా ఏడుస్తుండటాన్ని గమనించిన అటుగా వెళుతున్న ప్రయాణికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, బాలుడిని సురక్షితంగా తమ సంరక్షణలోకి తీసుకున్నారు. దంపతులు వదిలివెళ్లిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే స్థానిక ఈతగాళ్లు, సహాయక సిబ్బంది సహకారంతో గోదావరి నదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. దంపతుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే, వారు ఈ దారుణ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారిని విచారించి వివరాలు సేకరిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే వారు బలవన్మరణానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. దొడ్డ సాయి ఓ ప్రైవేటు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్ గా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్ కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు, ప్రస్తుత ఉదంతానికి ఎటువంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దర్యాప్తు పూర్తయితే గానీ ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## బలమైన వాదనలు వినిపించండి

కరవు, ఫ్లోరైడ్, వెనకబడిన ప్రాంతాల్లో ప్రజల సాగు, తాగునీటి అవసరాలను ఆధారాలతో చూపి వాదించాలని కోరారు.బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన 811 టీఎంసీలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని, తర్వాత కృష్ణా ట్రైబ్యునల్-2 కేటాయించిన నీటిపై కసరత్తు ముమ్మరం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలిలా ఉన్నాయి. మొదట ట్రైబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు, ప్రస్తుత పరిస్థితి గురించి సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం, తర్వాత మొత్తం కేటాయింపుపై విచారణకు కేంద్రం జారీ చేసిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్), దీనిపై ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 65 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులు, దీనిపై సుప్రీంకోర్టులో కేసు కారణంగా తీర్పు నోటిఫై కాకపోవడం గురించి చెప్పారు.

**సెప్టెంబరు 16-18 వరకు తెలంగాణ వాదనలు**

2023 అక్టోబరు 6న కేంద్రం జారీ చేసిన తదుపరి టీఓఆర్ ప్రకారం తుది వాదనలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ వాదనలు ఆగస్టు 13న ముగియగా, తెలంగాణ తరఫున రిజాయిండర్ వాదనలు 14న జరిగాయని, సెప్టెంబరు 16-18 వరకు జరిగే ట్రైబ్యునల్ సమావేశాల్లో తెలంగాణ తదుపరి వాదనలు వినిపించాల్సి ఉందని న్యాయవాదులు వివరించారు. బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించగా.. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 65 శాతం, సరాసరి నీటి లభ్యతతో చేసిన కేటాయింపులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1050 టీఎంసీలున్నాయి. అయితే బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పును ఇంకా నోటిఫై చేయనందున మొదట బచావత్ కేటాయించిన 811 టీఎంసీల్లో ఎక్కువ వాటా, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై దృష్టి కేంద్రీకరించాలని న్యాయవాదుల బృందానికి, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం ఇంజినీర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ కేటాయింపులను మనం వ్యతిరేకించి సుప్రీంకోర్టుకు వెళ్తే, అమలు చేయాలని కర్ణాటక కోరుతుందని, ప్రస్తుత లక్ష్యం 811 టీఎంసీలేనని స్పష్టం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమలైతే కృష్ణా నదీ యాజమాన్యబోర్డు మనుగడ కూడా ఉండదని, ట్రైబ్యునల్ సిఫార్సు చేసిన పర్యవేక్షణ బోర్డు ఉంటుందని, దీనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

**వరద నీటిపై స్పష్టత ఉండాలి**

వరద నీటిపై కూడా స్పష్టత ఉండాలని, కృష్ణాపై ఉన్న మూడు ప్రాజెక్టులు నిండి పైనుంచి ప్రవహించినపుడే వరద నీరని, అయితే వరద నీటిమీద ఆధారపడి చేపట్టిన ప్రాజెక్టులకు వరద రాకుండానే నీటిని తీసుకోవడాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. మల్యాల, ముచ్చుమర్రి నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తీసుకోవడంవల్ల విద్యుదుత్పత్తిపై ప్రభావం పడుతుందని, వరద లేకుండానే ఆంధ్రప్రదేశ్ మళ్లించినపుడు కోల్పోయే విద్యుత్తుకు పరిహారం కోరే అంశాన్ని, దీనిని ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడం గురించి ఆలోచించాలని న్యాయవాద బృందానికి, ఇంజినీర్లకు సీఎం సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2014 కంటే ముందు మంజూరైన ప్రాజెక్టుల వివరాలన్నీ తయారు చేయాలని ఇంజినీర్లను సీఎం ఆదేశించారు. తెలంగాణకు జరిగిన అన్యాయం, బేసిన్ పరిధిని పరిగణనలోకి తీసుకొని నీటిని పంపిణీ చేయమని గట్టిగా కోరడం, కృష్ణా ట్రైబ్యునల్-1, కృష్ణా ట్రైబ్యునల్-2 కలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1050 టీఎంసీలు, పోలవరం ద్వారా తరలించే 45 టీఎంసీల్లో 71 శాతం వాటా కోరాలని, ఆంధ్రప్రదేశ్ బేసిన్ బయటి ప్రాజెక్టులకే 325 టీఎంసీలు మళ్లిస్తుందని, బేసిన్‌లోని ప్రాజెక్టులకే ఎక్కువ నీటిని కేటాయించాలని, పంట నీటి అవసరాలను శాస్త్రీయంగా అంచనా వేసి ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. టీఓఆర్‌ను సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన కేసు, కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించాలని ఏపీ దాఖలు చేసిన కేసు, కృష్ణా ట్రైబ్యునల్-2ను నోటిఫై చేయాలని వేసిన కేసులు, కర్ణాటకలోని అప్పర్ భద్ర, అప్పర్‌తుంగ ప్రాజెక్టులకు అనుమతులివ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన కేసు, పోలవరం-నల్లమలసాగర్/బనకచెర్ల నీటిమళ్లింపును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన కేసుల గురించి ముఖ్యమంత్రి, మంత్రి న్యాయవాదులు, అధికారులతో వివరంగా చర్చించారు. సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు గోపాల్ శంకర్ నారాయణ్, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, కార్యదర్శి శ్రీధర్, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం ఇంజినీర్లు పాల్గొన్నారు.

## తెలుగు ఎన్నారై కుటుంబం గల్లంతు

చెందిన ఒక ప్రవాసాంధ్ర (ఎన్నారై) కుటుంబం మానస సరోవర యాత్రలో వరద నీటిలో గల్లంతవ్వడం తీవ్ర శోకాన్ని నింపింది. పార్వతీపురం పండా వీధికి చెందిన సుభాష్ చంద్ర సాహూ పెద్ద కుమారుడు సంతోష్ కుమార్ సాహూ (47) గత 20 ఏళ్లుగా లండన్‌లో స్థిరపడ్డారు. తాజాగా ఆయన తన భార్య సురభి (43), కుమారుడు స్పందన్ (18), కుమార్తె సైనా (13)లతో కలిసి లండన్ నుంచి నేపాల్ మార్గంలో మానస సరోవర్ యాత్రకు బయలుదేరారు. యాత్రలో భాగంగా వీరంతా ప్రయాణిస్తున్న వాహనం ఓ వంతెన దాటుతుండగా ఒక్కసారిగా విరుచుకుపడిన వరద ఉధృతికి ఊహించని రీతిలో వంతెన కొట్టుకుపోయింది. ఈ విషాద సమాచారాన్ని స్థానిక నేపాల్ గైడ్ సంతోష్ బంధువులకు అందించాడు. ఇప్పటివరకు ఆ వాహనం గానీ, కుటుంబ సభ్యుల ఆచూకీ గానీ లభించకపోవడంతో బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సంతోష్ తల్లిదండ్రులు ప్రస్తుతం సౌతాఫ్రికాలో ఉంటున్న తమ రెండో కుమారుడి వద్ద ఉండగా, బిడ్డలు, మనవళ్లు ఆకస్మిక ప్రళయంలో గల్లంతయ్యారన్న వార్త విని కన్నీరుమున్నీరవుతున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నాగబాబుకు చిరంజీవి అభినందనలు.. కొత్త బాధ్యతలపై అన్నయ్య హర్షం

జనసేన ఎమ్మెల్సీ, తన సోదరుడు కొణిదెల నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు ఇవాళ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, చిరంజీవి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఇది నాగబాబుకు లభించిన ఒక గొప్ప అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. "ప్రియమైన నాగబాబు, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రకృతిపై నీకున్న మక్కువకు ప్రతిఫలంగా ప్రకృతి మాత ప్రసాదించిన అద్భుత అవకాశంగా దీన్ని భావిస్తున్నాను" అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పచ్చని, మెరుగైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నూతన ప్రయాణంలో నాగబాబు విజయవంతం కావాలని, ప్రజలకు మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఇటీవల ఈ పదవిలో నియమితుడైన నాగబాబు, బాధ్యతలు చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'గ్రీన్ ఆంధ్రప్రదేశ్' లక్ష్యం కోసం పూర్తి నిబద్ధతతో కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి: పవన్ కల్యాణ్

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## నార్వే రాజు కన్నుమూత

మరణంతో పట్టపు రాకుమారుడైన 53 ఏళ్ల హాకోన్‌ను రాజుగా ప్రకటించారు. ఆయన ఎనిమిదో హాకోన్ రాజుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. హాకోన్ పెద్ద కుమార్తె ఇన్‌గ్రిడ్ అలెగ్జాండ్రా నార్వేకు పట్టపు రాకుమారి అవుతారు. హాకోన్ రాజు తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించే అవకాశం ఆమెకే లభిస్తుంది.. నార్వేలో రాజు కేవలం లాంఛనప్రాయమైన అధికారం కలిగివుంటారు. అసలు అధికారం ప్రజలెన్నుకున్న పార్లమెంటు చేతుల్లో ఉంటుంది.

**మోదీ సంతాపం**

నార్వే రాజు ఐదవ హరాల్డ్ మరణంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మీయత తన అంతరంగాన్ని తాకిందని ప్రధాని పేర్కొన్నారు. నార్వేకు ఆయన చేసిన సేవ మరువ లేనిదని ప్రస్తుతించారు.

# ఎడిటర్ వాయిస్

## స్థానికంపై షర్మిల ప్రభావం ఎంత..?

గత 2024 అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ప్రభావం ఎక్కువగా కనిపించింది. తన పార్టీతరఫున 148 మందిని రంగంలోకి దింపి భారీ పోటీనే ఆమె ఇచ్చారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కూడా పర్యటించారు. వాస్తవానికి పార్టీ పరంగా బలంగా లేదని తెలిసినా.. వైసీపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా షర్మిల అప్పట్లో ప్రచారం చేశారు. తమ బాబాయి వివేకా హత్య కేసును, తనకు జరిగిన కుటుంబ అన్యాయాన్ని కూడా ఆమె ఏకరువు పెట్టారు.

ముఖ్యంగా కడప ఎంపీ స్థానం నుంచి పోటీ చేసిన షర్మిల.. ఇక్కడ వైసీపీ ఎంపీ అభ్యర్థి అవినాష్‌ను ఓడించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. ఇక, వైసీపీ ఓటమి కావాలని కోరుకున్న వివేకా కుమార్తె సునీత కూడా.. కడప జిల్లాలో పర్యటించారు. పాదయాత్ర చేశారు. మొత్తంగా రాష్ట్రంలో వైసీపీని గద్దె దింపేశారు. ఇక, ఆ తర్వాత.. అంతే స్థాయిలో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ పుంజుకునేందుకు ప్లాన్ చేస్తోంది. తద్వారా.. గత ఎన్నికల్లో పోయిన ప్రభావాన్ని దక్కించుకునే ప్లాన్ చేస్తోంది.

ఇది జరగ కూడదని.. వైసీపీ పుంజుకుంటే ప్రమాదమని కూటమి ప్రభుత్వంలోని నాయకులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పరంగా షర్మిల ఎలాంటి అడుగులు వేస్తారు? స్థానికంపై ఆమె ప్రభావం ఎంత? వైసీపీకి ఏమేరకు ఆమె గండి కొడతారు? అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం గా మారింది. గత ఎన్నికల సమయంలో షర్మిల తొలిసారి జగన్‌పై విమర్శలు గుప్పించారు. దీనిని ప్రజలు రిసీవ్ చేసుకున్నారు. ఫలితంగా వైసీపీ పరాజయానికి ఆమె కూడా ఒక రీజన్‌గా మిగిలారు.

కానీ.. ఇప్పుడున్న పరిస్థితిలో షర్మిల ఏమేరకు పార్టీ తరఫున పుంజుకుంటారన్నది ప్రశ్నగా మారింది. ఆమె ఒకవైపే చేస్తున్నారన్న వాదన సొంత నేతల్లోనే వినిపిస్తోంది. పైగా స్థానికంగా నాయకుల కొరత కూడా వెంటాడుతోంది. ప్రస్తుతం ఈ విషయంపై షర్మిల చాలా వరకు మౌనంగా ఉన్నారు. వైసీపీ ఓటు బ్యాంకుకు గండి కొట్టే దిశగా ఆమెఆలోచన చేస్తున్నారని.. తమ ఓటు బ్యాంకును వైసీపీ సొంతం చేసుకుందని.. ఇప్పుడు దానిని తిరిగి సాధించే దిశగా ఆలోచన చేస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి పళ్లం రాజు చెప్పుకొచ్చారు. కానీ, ఆమె ఏం చేస్తారు? అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. మరి స్థానికంపై షర్మిల ప్రభావం ఎంత ఉంటుందన్నది ముున్ముందు చూడాలి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




### రామచంద్రపురంలో విషాదం..

## ఉరివేసుకుని ఫార్మా కంపెనీ ఉద్యోగి ఆత్మహత్య

**రామచంద్రపురం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో ఓ విషాద ఘటన జరిగింది. పట్టణంలోని 8వ వార్డు అంకంవారి వీధికి చెందిన కొప్పిశెట్టి వెంకటేష్ (27) అనే యువకుడు తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న వెంకటేష్, నాలుగు రోజుల క్రితమే ఊరికి వచ్చాడు. ఆగస్టు 27 రాత్రి స్థానికంగా జరిగిన పండుగకు వెళ్లాడు. అక్కడ ఎవరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత తెల్లవారుజామున ఇంటికి తిరిగి వచ్చాడు. మరుసటి రోజు ఆగస్టు 28 ఉదయం 7 గంటల సమయంలో తండ్రి కొప్పిశెట్టి రాజు కుమారుడి గదికి వెళ్లి చూసేసరికి.. వెంకటేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. కొడుకు మరణంపై తండ్రి రాజు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు. జతీ.చీశీ.133/2026 ఖ/o 194 దీచీూా కింద కేసు ఫైల్ చేసి విచారణ మొదలుపెట్టినట్లు ఎస్సై చెప్పారు. అసలు వెంకటేష్ ఫోన్‌లో ఎవరితో మాట్లాడాడు, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒడిశా టు హైదరాబాద్ వయా ఖమ్మం

### 18 గంటలపాటు పోలీసుల ఆపరేషన్ - గంజాయి తరలిస్తున్న నిందితుల అరెస్టు



**చౌటుప్పల్(గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారనే సమాచారం ఈగల్ ఫోర్స్‌కు అందడంతో పోలీస్ బృందాలు 18 గంటల ఆపరేషన్ కొనసాగించి.. నిందితులను పట్టుకున్న ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం..ఒడిశాలోని రాజ్‌నగర్ గ్రామానికి చెందిన త్రిలోచన్ సమంత్రా(30), సాగర్‌బాల్(23).. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ఈగల్ ఫోర్స్ రంగంలోకి దిగింది. ఈగల్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్, ఖమ్మం ఆర్ఎన్‌సీసీ బృందాలు, చౌటుప్పల్ పోలీసులతో కలిసి వారి ప్రయాణ కదలికలపై నిరంతరం నిఘా పెట్టాయి. ఒడిశా నుంచి బయలుదేరిన నిందితులు ఏపీలోని సబ్బవరం వద్ద 7 గంటలకుపైగా ఆగినా ఓపికగా నిరీక్షించాయి. గురువారం ఉదయం అక్కణ్నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన నిందితులు ఖమ్మం, సూర్యాపేట మార్గంలో వస్తుండగా..ఖమ్మంలోని ఆర్ఎన్‌సీసీ బృందం 2గంటల పాటు కారును వెంబడించింది. ఎట్టకేలకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద గురువారం రాత్రి పోలీసు బృందాలు కారును అడ్డుకొని నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నాయి.

**కిలో రూ.25 వేలకు విక్రయించేందుకు ఒప్పందం**

ఒడిశా నుంచి తీసుకొస్తున్న గంజాయిని హైదరాబాద్‌లో కిలో రూ.25 వేలకు విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. 'హైదరాబాద్‌కు చెందిన బికాష్ బారిక్(రిసీవర్) అభ్యర్థన మేరకు ఒడిశాకు చెందిన అమిత్ సాహని(సప్లయర్) నుంచి నిందితులు 20.5 కిలోల గంజాయి సేకరించి తీసుకొస్తున్నారు. గతంలో కూడా త్రిలోచన్ సమంత్రా.. బికాష్ బారిక్‌కు గంజాయి సరఫరా చేశాడు. గత జూన్‌లో బికాష్ బారిక్ హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయ్యాడు. ప్రస్తుతం బికాష్ బారిక్, అమిత్ సాహని పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు ప్రయత్నిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.10.25 లక్షలు ఉంటుంది' అని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

## అమెరికాలో చంపేశాడు... ఆగ్రాలో దొరికాడు

### హైదరాబాద్ యువతి హత్య కేసులో 8 నెలల తర్వాత నిందితుడి అరెస్టు

### ఆమె బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీ చేయడంతో చిక్కిన ఆచూకీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో హత్యకు గురైన హైదరాబాద్ యువతి నిఖిత(27) కేసులో ఎనిమిది నెలలుగా పరారీలో ఉన్న నిందితుడు అర్జున్‌శర్మ(27) ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మృతురాలి బ్యాంకు ఖాతాలోని నగదును బదిలీ చేసుకోవడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ఆగ్రాలో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లాలాగూడకు చెందిన నిఖిత ఎంఎస్ చదివేందుకు 2022లో అమెరికా వెళ్లారు. అక్కడ చెన్నైకి చెందిన అర్జున్‌శర్మ పరిచయమవగా.. ఇద్దరూ కలిసి కొన్నిరోజులు మేరీల్యాండ్‌లోని ఒకే ఇంట్లో అద్దెకున్నారు. 2024లో నిఖితకు ఉద్యోగం రాగా.. అదే సమయంలో తన ఉద్యోగం పోయిందంటూ అర్జున్‌శర్మ, అతడి తల్లి రచనాశర్మ కలిసి నిఖితకు మాయమాటలు చెప్పి పెద్దఎత్తున డబ్బులు అప్పుగా తీసుకున్నారు. 2025 డిసెంబరు చివరి వారంలో అర్జున్‌శర్మ తాను తీసుకున్న డబ్బులు తిరిగిస్తానంటూ నిఖితను కొలంబియాలోని తన అపార్ట్‌మెంటుకు పిలిపించాడు. అనంతరం ఆమెపై కత్తితో దాడి చేసి గదిలో బంధించాడు. ఈ ఏడాది జనవరి 1న నిఖిత కనిపించడం లేదంటూ మేరీల్యాండ్ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసి భారతదేశానికి పారిపోయి వచ్చాడు. అనుమానం వచ్చిన అక్కడి పోలీసులు జనవరి 3న అతడి అపార్ట్‌మెంటులో తనిఖీ చేయగా నిఖిత మృతదేహం కనిపించింది. 2025 డిసెంబరు 31న హత్య జరిగినట్లు గుర్తించి లాలాగూడలోని ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు.

డబ్బులు కాజేయడంతో..: భారత్‌కు వచ్చిన అర్జున్‌శర్మ నిఖిత ఫోన్ నంబరు, డెబిట్‌కార్డు ఉపయోగించి ఆమె ఖాతాలోని నగదును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన ఆమె తండ్రి ఆనంద్ ఏప్రిల్ 16న లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ రక్షిత కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ రవికిరణ్, ఎస్సై విజయ్ బృందం దీనిపై దర్యాప్తు చేపట్టి నిందితుడు యూపీలోని ఆగ్రాలో ఉన్నట్టు గుర్తించారు. ఈ నెల 24న అతడిని అదుపులోకి తీసుకొని దిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రిమాండు విధించటంతో తిహాడ్ జైలుకు తరలించారు. తన కూతురు హత్యకు ప్రేమ వ్యవహారం కారణం కాదని, ఆర్థిక లావాదేవీల కోణంలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, అర్జున్‌శర్మ తల్లిని కూడా విచారించాలని కోరారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




శనివారం, 29 ఆగస్టు, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత — www.viswamvoice.com


# ఇర్రిపాకలో భక్తి పారవశ్యం.. మహిళలకు కంబాల దంపతుల స్వర్ణ కానుకల పంపిణీ

**జ్యోతుల నెహ్రూ దంపతుల నేతృత్వంలో కన్నులపండువగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు - ముఖ్య అతిథులుగా హాజరైన కంబాల శ్రీనివాసరావు దంపతులు**

**సొంత ఖర్చుతో 200 మంది మహిళలకు పట్టుచీరలు, బంగారు రూపుల అందజేత - సమాజ సేవ, హైందవ ధర్మ రక్షణే లక్ష్యంగా కంబాల విశేష కృషి**

**మూడు నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయల నిధులతో సేవా కార్యక్రమాల విస్తరణ - సెప్టెంబర్ 4, 5 తేదీల్లో ఇర్రిపాకలో నూతన ఆలయాలకు శంకుస్థాపనలు**





**కాకినాడ జిల్లా/ ఇర్రిపాక, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రావణ పౌర్ణమి, శుక్రవారం పర్వదినాలను పురస్కరించుకుని స్థానిక శివ కేశవుల క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు జ్యోతుల నెహ్రూ, మణి దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జగ్గంపేట నియోజకవర్గ బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న కంబాల దంపతులకు అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం శివ కేశవులను దర్శించుకున్న జ్యోతుల నెహ్రూ, కంబాల శ్రీనివాసరావు దంపతులు.. జ్యోతి ప్రజ్వలన చేసి వరలక్ష్మీ అమ్మవారి ప్రత్యేక పూజలను లాంఛనంగా ప్రారంభించారు. సమాజ సేవ, హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా అడుగులు వేస్తున్న కంబాల శ్రీనివాసరావు ఈ వేదికపై విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నారు. మహిళల్లో ఆధ్యాత్మిక చైతన్యం రగిలించాలన్న సంకల్పంతో, వ్రతాలు ఆచరించిన 200 మంది మహిళలకు ఆయన తన సొంత ఖర్చుతో బంగారు రూపులు, పట్టుచీరలు ఉచితంగా పంపిణీ చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జ్యోతుల నెహ్రూ ఆహ్వానం మేరకు ఈ పవిత్ర కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశం విశ్వగురువుగా నిలవడానికి మన సనాతన ధర్మం, సంస్కృతి సాంప్రదాయాలే మూలకారణమని, వాటిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆచరించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ధార్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయల సొంత నిధులతో ఆయన చేస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయాల జీర్ణోద్ధరణతో పాటు, వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి, పేదల ఆర్థిక సాధికారతకు తన నిధులను వెచ్చిస్తూ విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, ధార్మిక జాగృతి లక్ష్యంగా తన ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని ఉద్ఘాటించారు. కంబాల శ్రీనివాసరావు చేస్తున్న నిస్వార్థ సేవలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వేదికపై ప్రత్యేకంగా ప్రశంసించారు. ధర్మ పరిరక్షణకు, సమాజ అభివృద్ధికి కంబాల చేస్తున్న విశేష కృషి అత్యంత అభినందనీయమని కొనియాడారు. ఇర్రిపాక పుణ్యక్షేత్రం నిరంతరం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లాలనే ఉద్దేశంతోనే ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. క్షేత్ర అభివృద్ధిలో భాగంగా సెప్టెంబర్ 4వ తేదీన అష్టలక్ష్మి ఆలయానికి తన చేతుల మీదుగా, సెప్టెంబర్ 5వ తేదీన రామాలయ నిర్మాణానికి కంబాల శ్రీనివాసరావు చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నట్లు జ్యోతుల నెహ్రూ ప్రకటించారు. అనంతరం వ్రతాలు పూర్తి చేసుకున్న మహిళలకు జ్యోతుల నెహ్రూ, మణి, కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం దంపతులు స్వయంగా పసుపు, కుంకుమలతో పాటు పట్టుచీరలు, వరలక్ష్మి బంగారు రూపులను అందజేయడంతో కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసింది.

# గోకవరం పంచాయతీలో ఎస్సీలకు రిజర్వేషన్ ఎప్పుడొస్తుంది..?

**75 ఏళ్ల పంచాయతీ రాజ్ చరిత్రలో ఒక్కసారి కూడా ఎస్సీ రిజర్వేషన్ లేదా..?**

**ఓసీకి నాలుగుసార్లు.. బీసీ, ఎస్టీలకు రెండేసిసార్లు.. ఎస్సీలకు మాత్రం ఎందుకు అవకాశం లేదు?**

**13 వేల మంది ఓటర్లున్న మేజర్ పంచాయతీలో రిజర్వేషన్‌పై దళితుల ఆవేదన**



**గోకవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** "గోకవరం మేజర్ పంచాయతీలో ఎస్సీలు సర్పంచ్ కాకూడదా..? దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కు ఎప్పుడు అమలవుతుంది..? ఎప్పటికీ మేము బానిస బతుకులే బతకాలా..?" అంటూ గోకవరం గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం మేజర్ పంచాయతీలో సుమారు 13 వేల మంది ఓటర్లు ఉండగా, ఓసీ తర్వాత ఎస్సీల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు సర్పంచ్ లేదా ఉపసర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ రాకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడి దాదాపు 75 సంవత్సరాలు గడిచినా గోకవరం మేజర్ పంచాయతీలో ఓసీకి నాలుగుసార్లు, బీసీకి రెండుసార్లు, ఎస్టీకి రెండుసార్లు రిజర్వేషన్ వచ్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఎస్సీలకు మాత్రం ఇప్పటివరకు సర్పంచ్ పదవికి రిజర్వేషన్ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**15 శాతం జనాభా ఉన్నా అవకాశం లేదా?**

గోకవరం గ్రామంలో ఎస్సీల జనాభా సుమారు 15 శాతం వరకు ఉందని స్థానిక దళిత సంఘాలు పేర్కొంటున్నాయి. మరోవైపు సుమారు 2 శాతం ఎస్టీ జనాభా ఉన్నప్పటికీ రెండుసార్లు రిజర్వేషన్ అవకాశం లభించింది అని వారు అంటున్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలులో తమకు అన్యాయం జరుగుతోందని ఎస్సీ వర్గాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**బూరుగుపూడి నుంచి జగ్గంపేట వరకు..**

గతంలో బూరుగుపూడి నియోజకవర్గంలో ఉన్న సమయంలోనూ, ప్రస్తుతం జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న సమయంలోనూ గోకవరం పంచాయతీకి ఎస్సీ రిజర్వేషన్ రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విభజిత ఆంధ్రప్రదేశ్ వరకు ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు మారినా తమ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని, రాజకీయ జోక్యం వల్లే ఎస్సీ రిజర్వేషన్ రాకుండా పోయిందన్న అనుమానాలు ఉన్నాయని కొందరు దళితులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలి**

గోకవరం మేజర్ పంచాయతీ రిజర్వేషన్ల అంశంపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్సీ వర్గాల ప్రజలు కోరుతున్నారు. రిజర్వేషన్ రొటేషన్, జనాభా లెక్కలు, గతంలో జరిగిన రిజర్వేషన్ల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. "రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం మాకు కూడా రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలి. తరతరాలుగా ఎదురుచూస్తున్నాం. ఇకనైనా గోకవరం మేజర్ పంచాయతీలో ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలి" అని దళితులు కోరుతున్నారు.

**ప్రజల ప్రశ్న ఒక్కటే..**

"ఓసీకి నాలుగుసార్లు.. బీసీ, ఎస్టీలకు రెండేసిసార్లు అవకాశం వచ్చినప్పుడు.. ఎస్సీలకు ఒక్కసారి కూడా ఎందుకు రాలేదు?" ఈ ప్రశ్నకు అధికార యంత్రాంగం పారదర్శకంగా సమాధానం చెప్పాలని గోకవరం దళితులు కోరుతున్నారు.

### గోదావరి పుష్కరాలకు

# నాసిక్ కుంభమేళా విధానాలు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాల్లో నాసిక్ కుంభమేళాలో అనుసరిస్తున్న అధునాతన సాంకేతిక విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేయాలని పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ సూచించారు. పుష్కరాల ఏర్పాట్లపై శుక్రవారం అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. భక్తుల రద్దీ, భద్రత, రాకపోకలు, ఆరోగ్యం, పారిశుధ్యం, భక్తుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నాసిక్‌లో వినియోగిస్తున్న నిఘా కెమెరాలు, సెన్సార్లు, నియంత్రణ కేంద్రాలు, కృత్రిమ మేధ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పుష్కరాల్లో వినియోగించుకోవాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఘాట్లు విస్తృతంగా ఉన్నందున స్థానిక భౌగోళిక పరిస్థితులు, భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా రంగాల్లో నైపుణ్యం కలిగిన సంస్థల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నర్సింహ కిషోర్, సంయుక్త కలెక్టర్ మెఘా స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, పుష్కరాల ప్రత్యేక ఉప కలెక్టర్ ఏ.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్ గాంధీ విగ్రహం ధ్వంసంపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

**పోలీసులు స్పందించకపోతే నిరహార దీక్ష చేస్తాం.. : హెచ్చరించిన టీకే విశ్వేశ్వర రెడ్డి, బాలేపల్లి మురళీధర్**



**రాజమహేంద్రవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి జాంపేట వంతెన సమీపంలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం చేతిని ధ్వంసం చేసిన ఘటన దారుణమని అర్బన్ కాంగ్రెస్ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికే విశ్వేశ్వర్ రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, 15 రోజుల్లో నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సీరియస్ గా స్పందించకపోతే ఆ విగ్రహం వద్దనే నిరాహార దీక్ష చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. రాజమహేంద్రవరంలో శాంతిభద్రతల పరిస్థితి దారి తప్పుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్పీ శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం, ప్రియాంక హత్య ఘటనపై కనీసం ప్రకటన కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బయట వ్యక్తుల్ని ఎక్కడ పార్లమెంటు సభ్యులుగా ఎన్నుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదని ఓటర్లు కూడా ఈ విషయంలో పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. నిన్న కార్పొరేషన్ లో జరిగిన సమావేశంలో ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం తమ దృష్టికి వచ్చిందని నిధులు విడుదల చేయకుండా పనులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలకు, జాతీయ నాయకుల పట్ల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశానికి కంప్యూటర్లను పరిచయం చేసి ఐటి రంగంలో ఎంతో అభివృద్ధి, ప్రగతి సాధించేలా కృషి చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం ధ్వంసం చేయడం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్ని చాలా విస్మయానికి గురి చేసిందని అన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు ఎప్పటి నుంచి సరైన విధంగా నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోకపోతే యాత్రికులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షుడు ఎస్ మార్టిన్ లూథర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాజశేఖర్, తాడి సూరిబాబు, బత్తిన చంద్రరావు, బర్రె సుబ్రహ్మణ్యం, సింధియా రాణి, నిల్లా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీగా రెడ్డి రాజబాబు



**అభినందనలు తెలిపిన యరమాటి వెంకన్నబాబు**

**మండపేట టౌన్, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల వైఎస్ఆర్ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించిన రాష్ట్ర అనుబంధ విభాగాల నియామకాలలో భాగంగా మండపేటకు చెందిన సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు ను వరుసగా రెండోసారి వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం సెక్రెటరీగా నియామకం చేయడం జరిగింది. ఈ నియామకం పట్ల వైఎస్ఆర్సీపీ మండపేట నియోజకవర్గం ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు అభినందనలు తెలిపారు.






# శ్రీ చైతన్యలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు




**మండపేట మండలం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు పరస్పరం ప్రేమాభిమానాలు, ఆప్యాయత, అనురాగంతో మెలగాలనే సందేశాన్ని విద్యార్థుల్లో పెంపొందించే ఉద్దేశంతో తాపేశ్వరం చైతన్య స్కూల్ లో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ-ప్రైమరీ ప్రైమరీ విద్యార్థులు ఉత్సాహంగా రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు విద్యార్థులకు ప్రేమాభిమానాలకు, రక్షణకు ప్రతీకగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ఒకరికొకరు మిఠాయిలు పంచుకుని ఆనందోత్సాహాలతో వేడుకలను నిర్వహించారు. రాఖీ పౌర్ణమి కేవలం పండుగ మాత్రమే కాకుండా, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న అనుబంధం, ప్రేమ, బాధ్యత పరస్పర రక్షణకు ప్రతీక అని విద్యార్థులకు వివరించారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సోదరభావం, ఐకమత్యం, పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలు పెంపొందాలని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ప్రతి విద్యార్థి స్వార్థ భావనను విడిచిపెట్టి స్వచ్ఛమైన మనసుతో ఇతరులను గౌరవించడం, అవసరమైనప్పుడు తోడుగా నిలవడం, ఒకరినొకరు రక్షించుకోవడం వంటి మంచి విలువలను అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కుటుంబ బంధాల గొప్పతనాన్ని చిన్నారులకు తెలియజేయడంలో ఇలాంటి పండుగల వేడుకలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని రాఖీ పండుగ విశిష్టతను ప్రతిబింబించారు. వేడుకల సందర్భంగా చిన్నారుల ఆనందోత్సాహాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో సోదరభావం, ప్రేమ, ఐక్యత, మానవీయ విలువలను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలలో నిరంతరం నిర్వహిస్తామని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని రాఖీ పౌర్ణమి పండుగను ఆనందంగా నిర్వహించారు.






# ఆడ పడుచులకు అన్నగా.. అండగా ఉంటా..

**మంత్రి సుభాష్‌కు రాఖీ కట్టేందుకు వేలాదిగా తరలివచ్చిన మహిళలు - "అన్నయ్యతో ఒకరోజు" పేరుతో రామచంద్రపురంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు**

**రామచంద్రపురం నియోజవర్గం రూపురేఖలు మారుస్తా - కోటిపల్లి- ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధిస్తా : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్** : అనురాగం, ఆత్మీయత, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను రామచంద్రపురం టౌన్‌హాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని వేలాది మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచుకు అన్నగా అండగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని తెలిపారు. రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే పండుగ మాత్రమే కాదని, అనురాగం, ఆత్మీయత, ఆత్మవిశ్వాసంతో కూడిన బంధాలను మరింత బలోపేతం చేసే పండుగ అని పేర్కొన్నారు.

**కోటిపల్లి ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధిస్తా**

రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధికి గడచిన రెండేళ్లలో 250 కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చే దిశగా ప్రణాళికను సిద్ధం చేశామని వెల్లడించారు. రానున్న కాలంలో కోటిపల్లి ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధించి తీరుతానని మంత్ర ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయంగా నియోజవర్గ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తానన్నారు.

**మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

మహిళల సంక్షేమానికి, వారి ఆర్థిక పరిపుష్టికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సుభాష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు.

**ధైర్యం కోల్పోవద్దు.. ఆత్మహత్యలకు పాల్పడవద్దు**

ఇటీవల కాలంలో కొంతమంది వచ్చిన సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనివల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని మహిళ లోకానికి అభయమించారు.

**సేవ కోసమే రాజకీయాల్లోకి..**
**రామచంద్రపురమే నా శాశ్వత చిరునామా**

సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని.. రామచంద్రపురం నియోజవర్గంలోనే శాశ్వతంగా ఉంటానని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో రామచంద్రపురం నియోజవర్గం భవిష్యత్తులో జనరల్ అవుతుందని, మంత్రి సుభాష్ అమలాపురం వెళ్ళిపోతారు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, శాశ్వతంగా రామచంద్రపురం నియోజవర్గంలోనే ఉంటానని హామీ ఇచ్చారు.

**మహిళలతో కలిసి ప్రేమ విందు**

రక్షాబంధన్ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళల కోసం మంత్రి సుభాష్ ప్రత్యేకంగా ప్రేమ విందు ఏర్పాటు చేశారు. మహిళలతో కలిసి మంత్రి భోజనం చేస్తూ వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. మహిళలు తమ సమస్యలను మంత్రికి వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

**ఆటలు.. పాటలు.. సందడి**

రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా మహిళలకు ఉత్సాహాన్ని కలిగించేలా పలు వినోద కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. నృత్యం, పాటల పోటీలు, అంత్యాక్షరి, టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట తదితర పోటీలను నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వేడుకల్లో మహిళలు మంత్రి సుభాష్‌కు రాఖీలు కట్టి, ఆయనకు తమ ఆత్మీయతను తెలియజేశారు. కార్యక్రమం మొత్తం సందడి, ఉత్సాహంతో సాగింది. అనంతరం రాఖీ వేడుకలకు హాజరైన ఆడపడుచులకు నూతన వస్త్రాలు మంత్రి తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, వేలాదిమంది మహిళలు, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మహిళలు హాజరై రక్షాబంధన్ వేడుకలను విజయవంతం చేశారు.

**2011కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు**

## టెట్ మినహాయింపు ఇవ్వాలి

**ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి**



**రామచంద్రపురం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రపురంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాన్ని పలు డిమాండ్లు చేశారు. 2011కి ముందు నియమితులైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన స్పెషల్ టెట్‌లో ప్రత్యేకంగా ఎలాంటి వెసులుబాటు లేనందున, ఈ పరీక్షలో అందరికీ 40 శాతం ఉత్తీర్ణత మార్కులుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ పరీక్షలను ఆఫ్‌లైన్ విధానంలోనే నిర్వహించడంతో పాటు, సిలబస్ కూడా ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టులకు సంబంధించినదిగానే ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పీఆర్సీ , ఇతర ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే ఐఆర్ ప్రకటించి, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మాగాపు ప్రదీప్ కుమార్, ఎం. సుబ్బలక్ష్మి, కె. గంగవరం కార్యకర్తలు దాసరి శ్రీను, ఎస్. రవి, చల్లా శ్రీను, పి. గుణవంతుడు, టి. గణేష్, వి. లక్ష్మి, డి. లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన రామచంద్రపురం**

## ప్రభుత్వ కళాశాల విద్యార్థులు




**రామచంద్రపురం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్** : తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన, వచన కవితా పోటీల్లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. కళాశాలలో స్పెషల్ తెలుగు మూడో సంవత్సరం చదువుతున్న ఉదయభాను, రెండవ సంవత్సరం చదువుతున్న ప్రశాంతి ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. చిట్టిబాబు గారు వెల్లడించారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ద్వారా వారిలో ఉన్న సృజనాత్మకత మరింత మెరుగుపడుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రావీణ్యత సాధించడంలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఎప్పుడూ ముందంజలో ఉంటారని తెలియజేస్తూ, తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు సాధించడం పట్ల ఆయన తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసి, వారికి సరైన తర్ఫీదు ఇచ్చిన తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎన్. సుజాత గారిని, అలాగే విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ నాగరాజుతో పాటు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం ప్రత్యేకంగా అభినందించారు.

# అముడా పరిధి విస్తరణతో సమగ్ర పట్టణాభివృద్ధికి అవకాశం

**ఒక పట్టణ స్థానిక సంస్థ, 8 మండలాల విలీనం - కొత్తగా చేరిన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ**

**నిబంధనల ప్రకారమే భవన, లేఅవుట్ అనుమతులు : అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు**



**అమలాపురం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్** : అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిని విస్తరిస్తూ ఒక అదనపు పట్టణ స్థానిక సంస్థతో పాటు ఎనిమిది మండలాలను చేర్చడం ద్వారా సమగ్ర పట్టణాభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడిందని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి తెలిపారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడుతో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నం.35, తేదీ 20.03.2023 ద్వారా అముడాను ప్రారంభంగా ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అప్పట్లో 11 మండలాల పరిధిలోని 120 రెవెన్యూ గ్రామాలు, 896.16 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం అముడా పరిధిలో ఉండేదన్నారు. అనంతరం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అముడా పరిధిని సవరించి 14 మండలాలు, అదనపు పట్టణ స్థానిక సంస్థలు, మొత్తం 176 రెవెన్యూ గ్రామాలను పరిధిలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నం.203, తేదీ 27.08.2026 ప్రకారం అముడా పరిధిని మరింత విస్తరించినట్లు తెలిపారు. తాజా పునర్వ్యవస్థీకరణలో ఒక అదనపు పట్టణ స్థానిక సంస్థతో పాటు ఎనిమిది మండలాలను అముడా పరిధిలోకి చేర్చినట్లు చెప్పారు. దీంతో ప్రస్తుతం అముడా పరిధిలో 19 మండలాలు, మూడు పట్టణ స్థానిక సంస్థలు, 272 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, మొత్తం 1,765.45 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అముడా ఏర్పాటైనట్లు తెలిపారు. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీ, రామచంద్రపురం మున్సిపాలిటీ అముడా పరిధిలోని పట్టణ స్థానిక సంస్థలుగా ఉన్నాయని వివరించారు. అముడా పరిధిలోకి కొత్తగా వచ్చిన గ్రామ పంచాయతీల్లో పరిపాలనా, పట్టణాభివృద్ధి కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ, అముడా పరిధిలో అమలయ్యే నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతుల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అముడా పరిధి విస్తరణతో జిల్లాలో ప్రణాళికాబద్ధమైన, సమగ్ర పట్టణాభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడిందని అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తెలిపారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటై మూడు సంవత్సరాలు పూర్తైన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఎంతో ప్రాధాన్యత కలిగిందన్నారు. ఇప్పటివరకు రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు, రామచంద్రపురం మున్సిపాలిటీ ఇతర అభివృద్ధి సంస్థ పరిధిలో ఉండేవని తెలిపారు. ఈ అంశాన్ని గుర్తించి స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో చర్చించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాలను అముడా పరిధిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణను కలిసి ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు చైర్మన్ తెలిపారు. కొన్ని సాంకేతిక, పరిపాలనా అంశాల కారణంగా ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, చివరకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని చెప్పారు. జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణించి సమగ్ర పట్టణాభివృద్ధి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నం.203 ద్వారా అముడా పరిధిని పునర్వ్యవస్థీకరించడం అభినందనీయమన్నారు. కొత్తగా అముడా పరిధిలోకి వచ్చిన ప్రాంతాల్లో భవన నిర్మాణాలు, లేఅవుట్లు, ఇతర అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టే సమయంలో అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అముడా చైర్మన్ సూచించారు. అవసరమైన సందర్భాల్లో అముడా నుంచి ముందస్తు అనుమతులు పొందిన తరువాతే నిర్మాణాలు చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 300 చదరపు మీటర్లకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతుల విషయంలో వర్తించే నిబంధనలు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం తదితర అంశాలపై ప్రజలకు, పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన అవగాహన కల్పిస్తామని తెలిపారు. అముడా పరిధి విస్తరణతో మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీల మధ్య సమన్వయం మరింత పెరుగుతుందని అల్లాడ స్వామి నాయుడు తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతులు, నివాస, వాణిజ్య ప్రాంతాల అభివృద్ధిపై భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పునర్వ్యవస్థీకరణ, పరిధి విస్తరణకు సహకరించిన రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, పార్లమెంటు సభ్యులు హరీష్ మాధుర్, జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావులకు అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో అముడా పరిధి విస్తరణ సాధ్యమైందని, భవిష్యత్‌లో ప్రభుత్వ సహకారంతో అముడాను మరింత బలోపేతం చేసి ప్రాంతీయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

# మత్స్యకారులను స్వగ్రామానికి చేర్చిన ఎంపీ హరీష్ బాలయోగి

**ఏడుగురు మత్స్యకార కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం..**
**ఎంపీ హరీష్ బాలయోగికి గ్రామస్థుల కృతజ్ఞతలు**



**అమలాపురం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్** : సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను పశ్చిమ బెంగాల్ నుంచి అన్ని లాంఛనాలు పూర్తి చేసి స్వగ్రామానికి తరలించడంలో అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి కీలక పాత్ర పోషించారు. మత్స్యకారులను వారి స్వగ్రామానికి సురక్షితంగా చేర్చడంతో బాధిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నో రోజులుగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులు తమ వారిని కళ్లారా చూసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. మత్స్యకారులు కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సముద్రంలో వేటకు వెళ్లిన సమయంలో మత్స్యకారులు గల్లంతు కావడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండగా, వారిని సురక్షితంగా స్వగ్రామానికి తీసుకురావడానికి ఎంపీ హరీష్ బాలయోగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేశారు. సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి మత్స్యకారులను స్వగ్రామానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్ నుంచి మత్స్యకారులను స్వగ్రామానికి తరలించేందుకు అవసరమైన అన్ని లాంఛనాలను పూర్తి చేయడంతో పాటు, ప్రయాణ ఏర్పాట్లను కూడా సమన్వయం చేశారు. చివరకు మత్స్యకారులు స్వగ్రామానికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. తమ వారిని తిరిగి క్షేమంగా చూసుకోవడంతో కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇదిలా ఉండగా, గల్లంతైన మత్స్యకారుల బోటును తీరానికి చేర్చడంలో సహకరించిన ఇద్దరిని ఎంపీ హరీష్ బాలయోగి, గ్రామస్థులు దుశ్శాలువాలతో సత్కరించారు. మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు, బోటును సురక్షితంగా తీరానికి తీసుకురావడంలో సహకరించిన వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేస్తూ వారి స్వగ్రామానికి చేరే వరకు ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎంపీ హరీష్ బాలయోగికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమ కుటుంబాలకు అండగా నిలిచిన ఎంపీ చొరవను వారు అభినందించారు. మత్స్యకారుల స్వగ్రామానికి చేరికతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎన్నో రోజులుగా తమ వారు క్షేమంగా తిరిగి రావాలని ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ పరిణామం ఎంతో ఊరటనిచ్చింది. మత్స్యకారులు తమ కుటుంబ సభ్యులను కలుసుకున్న సమయంలో పలువురు భావోద్వేగానికి గురయ్యారు. గ్రామస్థులు వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. మత్స్యకారుల సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అధికారులతో నిరంతరం సమన్వయం చేసి వారిని స్వగ్రామానికి తీసుకురావడంలో ఎంపీ హరీష్ బాలయోగి చూపిన చొరవకు గ్రామస్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ఇదే విధంగా అండగా నిలవాలని కోరారు.

# యనమల సమక్షంలో టిడిపిలో చేరిన వైసీపీ నాయకులు

**కూటమీ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరిగింది - మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు**



**కోటనందూరు, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరుస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు.సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రం తొండంగికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కాకినాడ జిల్లా తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో వైసీపీకి రాజీనామా చేసిన నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు.వీరందరికీ సీనియర్ నేత యనమల రాజేష్ పసుపు కండువాలు కప్పి తెలుగు దేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ పాత కొత్త అనే బేధం లేకుండా అందరూ కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయ దుంధిబి మోగించాలని పిలుపు నిచ్చారు. ఇవాళ టీడీపీలో చేరిన వారిలో సోమరౌతు జగ్గారావు, నాగం బాబూరావు, నాగం దివాణం, మురాలశెట్టి రామకృష్ణ, పుణ్య వంతులు నాగేశ్వర్రావు, పి.రాంప్రసాదరావు, పి.నాగభూషణం, కోన చక్రరావు, గుండపు బుల్లి దొర,వెలుగుల బాలకృష్ణ లైశెట్టి రాజా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# సురక్షితంగా తిరిగొచ్చిన ఓడలరేవు మత్స్యకారులు

**స్వాగతం పలికిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ - ఆనందంలో కుటుంబ సభ్యులు**



**కాకినాడ, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవుకు చెందిన మత్స్యకారుల ఆచూకీ పశ్చిమ బెంగాల్‌లోని శంకర్‌పూర్ జెట్టి వద్ద లభ్యమైంది.ఈ నెల 3న వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రయాణిస్తున్న పడవ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో స్వగ్రామానికి తిరిగి రాలేకపోయారు. విషయం తెలుసుకున్న అధికారులు ప్రభుత్వ సహాయంతో వారిని సురక్షితంగా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం, రమణయ్యపేటలోని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మత్స్యకారులకు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం,కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుతో కలిసి స్వాగతం పలికారు.క్యాంపు కార్యాలయంలో మత్స్యకారులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేయగా కొద్దిసేపు విశ్రాంతి అనంతరం వారి స్వగ్రామమైన ఓడలరేవుకు పంపించారు.మత్స్యకారులు సురక్షితంగా తిరిగి రావడంతో వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# స్థానికంపై జనసేన వ్యూహమేంటి? 28 జడ్పీల్లో సేన వాటా ఎంత?

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా అలుముకుంటోంది. అన్నిపార్టీలు ఎన్నికల సన్నాహక సమావేశాలతో శ్రేణులను సిద్ధం చేస్తున్నారు. అయితే అధికార కూటమిలోని జనసేన వైఖరి ఎలా ఉంటుందనేదే ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్నిస్థానాల్లో పోటీ చేస్తుందనేది ప్రధాన చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. తమకు బలం ఉన్న చోట పోటీకి రెడీ అంటూ జనసేన నేతలు సంకేతాలు ఇవ్వడం కూటమి రాజకీయాలను వేడెక్కిస్తోంది. మరోవైపు టీడీపీ కూడా పోటీకి సై అంటుండటంతో స్థానిక ఎన్నికలు హీట్ పుట్టిస్తున్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశమే ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. గతంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటు, మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదించిన 80:15:5 నిష్పత్తి తమకు అంగీకారం కాదని జనసేన తేల్చిచెప్పడం, ఆ తర్వాత ఏ ప్రాతిపదికన పోటీ చేస్తారనే అంశమై స్పష్టత ఇవ్వకపోవడంతో స్థానిక ఎన్నికల్లో జనసేన పోటీపై కార్యకర్తలే అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో కొన్నిచోట్ల కూటమి సర్దుబాట్లపై అవగాహన రాకుండానే పదవుల కోసం జనసేనలో అంతర్గత రాజకీయాలు ఊపందుకోవడం చర్చకు తావిస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు ఉండగా, జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనేది అంతుచిక్కని అంశంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అదేవిధంగా 28 జిల్లా పరిషత్తులలో ఎన్నిస్థానాలను జనసేన తీసుకుంటుంది అనేది ఆసక్తి రేపుతోందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి కోసం తాము కాస్త తగ్గామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నారు. అంటే స్థానిక ఎన్నికల్లో తాము తగ్గే పరిస్థితి లేదని ఆయన పరోక్షంగా చెబుతున్నారా? అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. జనసేనాని పవన్ వ్యాఖ్యలు, జనసైనికుల అభిప్రాయాలను పరిశీలిస్తే స్థానిక ఎన్నికల్లో కూటమిలో టీడీపీతో సమానంగా పోటీకి సై అంటున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు మాత్రం తమకు 40 శాతం సీట్లు ఇవ్వాలని జనసేన కోరుకుంటోందని అంటున్నారు. ఈ ప్రచారమే నిజమైతే జనసేన రాష్ట్రంలో 50కి పైగా మున్సిపాలిటీలు, 10 నుంచి 14 జిల్లా పరిషత్తు స్థానాలను కోరుకుంటున్నట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ స్థాయిలో జనసేనకు కేటాయించేందుకు టీడీపీ సమ్మతిస్తుందా? అన్నదే చూడాల్సివుందని అంటున్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బలం ఉన్న అన్నిస్థానాల్లో పోటీ చేస్తామని జనసేన ప్రకటించడాన్ని టీడీపీ సీనియర్లు తప్పుపడుతున్నారని ప్రచారం జరుగుతోంది. పొత్తులో ఉన్నప్పుడు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఇలాంటి మాటలు ఆడటం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు. పొత్తులపై మూడు పార్టీల సమన్వయ సమావేశం ముగిసిన తర్వాతే ఎవరైనా పోటీపై ప్రకటన చేయాలని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పోటీపై జనసేన వ్యూహం ఎలా ఉంటుందనేది ఆసక్తి రేపుతోందని చెబుతున్నారు.

# నాగబాబు ఆన్ డ్యూటీ.. ఏపీ గ్రీన్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీ చైర్మనుగా కేబినెట్ హోదాలో నాగబాబు సేవలు అందించనున్నారు. ఏపీ గ్రీన్ చైర్మన్ గా నాగబాబును నియమిస్తూ దాదాపు 20 రోజుల క్రితమే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే మంచి ముహూర్తం కోసం ఇన్నాళ్లు ఎదురుచూసిన నాగబాబు శ్రావణ శుక్రవారం సందర్భంగా పండితుల వేది మంత్రోచ్చారణల మధ్య బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్య భవన్ లో ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో నాగబాబు పక్కనే ఆయన భార్య పద్మజ ఉన్నారు. పలువురు జనసేన నాయకులు, అటవీశాఖ అధికారుల సమక్షంలో నాగబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పని చేస్తానని నాగబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**50 శాతం పచ్చదనం పెంచుతా..**

ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96 శాతంగా ఉందని, 2047 నాటికి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యమని నాగబాబు స్పష్టం చేశ్శ. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదని, భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని ఆయన అభివర్ణించారు. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యతగా నాగబాబు వ్యాఖ్యానించారు. కాగా, ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడిని భాగస్వాములను చేసేలా పనిచేస్తామన్నారు.

**నాగబాబు కాదు నాగేంద్రరరావు**

ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబు ప్రమాణస్వీకారం చేసిన సమయంలో ఆయన టేబుల్ పై ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు చర్చకు తావిచ్చింది. సినీ రంగంలో నాగబాబుగా అందరికీ తెలిసిన నాగబాబు అసలు పేరు నాగేంద్రరావు అన్న విషయం శుక్రవారమే స్పష్టమైంది. ఎమ్మెల్సీగా నాగబాబు ఎన్నికైన అప్పటికీ అందరూ ఆయనను నాగబాబు అనే వ్యవహారిక నామంతోనే పిలుస్తున్నారు. కానీ, అధికారికంగా నాగబాబు అసలు పేరు నాగేంద్రరరావు అని సూచిస్తూ నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. "కొణిదెల నాగేంద్రరరావు, చైర్మన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఏపీ గ్రీన్ అంటూ బోర్డుపై స్పష్టంగా రాశారు. కాగా, చైర్మనుగా బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

### కోటనందూరు మండలంలో

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**సోదరీ, సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీక రాఖీ**

**కోటనందూరు, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో రక్షాబంధన్ వేడుకలు సోదర సోదరీమణులు ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసం పౌర్ణమి రోజు రాఖీ పౌర్ణమి లేదా రక్షాబంధనంగా జరుపుకుంటారు. జీవితాంతం ఒకరికొకరు అండగా ఉంటామని చేసుకొనే దివ్య ప్రతిజ్ఞ. సోదరి తన సోదరుని చేతికి రక్షా సూత్రాన్ని కట్టి అతని ఆయురారోగ్యాలు, విజయాలు, క్షేమాన్ని కోరుకుంటారు. సోదరుడు ఆమెకు ప్రేమ ఆదరణ రక్షణ అందిస్తానని సంకల్పిస్తాడు. రక్షాబంధనం కేవలం సోదరి సోదర సంబంధానికి మాత్రమే పరిమితం కాదు పరస్పర విశ్వాసం ప్రేమ బాధ్యత ధర్మరక్షణ అనే విశాలమైన భావాలకు రక్షా స్తోత్రం ప్రతీకగా నిలుస్తుంది. ఈ సందర్భంగా మహిళలు వయసు తో సంబంధం లేకుండా తమ సోదరులకు రాఖీలు కట్టి శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరము సోదరులు బహుమతులు అందజేశారు.

### మిస్ అయిన ఫోన్‌ను గంట వ్యవధిలో

# గుర్తించి బాధితుడికి అప్పగించిన పోలీసులు



**కోటనందూరు, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన ఖరీదైన సెల్‌ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అతి తక్కువ సమయంలో గుర్తించి బాధితుడికి తిరిగి అప్పగించారు కోటనందూరు పోలీసులు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం, ఎస్.బి. పట్నం గ్రామానికి చెందిన నకిరెడ్డి జగదీష్ అనే వ్యక్తి 27.08.2026 రాత్రి సుమారు 9:00 గంటల సమయంలో కోటనందూరు నుండి తన స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో సుమారు రూ.50,000/-రూపాయలు విలువచేసే ఐఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై బాధితుడు 28.08.2026న కోటనందూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమాచారం అందించగా, కోటనందూరు ఎస్.ఐ. టి. రామకృష్ణ వెంటనే స్పందించి పోలీస్ సిబ్బంది మరియు సాంకేతిక సహాయంతో సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించారు. ఫిర్యాదు అందిన సుమారు ఒక గంట వ్యవధిలోనే పోయిన ఐఫోన్ ను గుర్తించి బాధితుడు నకిరెడ్డి జగదీష్‌కు తిరిగి అప్పగించారు. తన రూ.50,000/- విలువైన సెల్‌ఫోన్‌ను అతి తక్కువ సమయంలో గుర్తించి తిరిగి అప్పగించినందుకు బాధితుడు కోటనందూరు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. టి. రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజలు తమ సెల్‌ఫోన్లకు సంబంధించిన ఐ ఎం ఈ ఐ నంబరు, కొనుగోలు బిల్లు తదితర వివరాలను భద్రపరుచుకోవాలని, సెల్‌ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

### సెప్టెంబర్ 1న

# 'ఛలో విజయవాడ'ను విజయవంతం చేయండి

**సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ అమలే ప్రధాన డిమాండ్**

**ఉద్యోగుల హక్కుల కోసం మరోసారి ఐక్యంగా ఉద్యమించాలి**

**గౌరవ అధ్యక్షుడు ఎం.రవికుమార్**




**కాకినాడ, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా. ఎం. రవికుమార్ పిలుపునిచ్చారు. సీపీఎస్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గతంలో చేపట్టిన పోరాటాల ఫలితంగా విధి నిర్వహణలో మృతి చెందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలకు కుటుంబ పెన్షన్,గ్రాట్యుటీ ప్రయోజనాలు సాధించామని తెలిపారు.2003 బ్యాచ్ ఉద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలు వర్తింపజేసే విషయంలోనూ సంఘం కీలకంగా పోరాడిందన్నారు.ఉద్యోగుల ఐక్యత,సంఘటిత పోరాటాల ద్వారానే గత విజయాలు సాధ్యమయ్యాయని,సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయించుకునేందుకు మరోసారి ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని రవికుమార్ పేర్కొన్నారు.సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి ప్రతి సీపీఎస్ ఉద్యోగి తరలివచ్చి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు."నిన్నటి విజయాలకు పోరాటమే కారణం.. రేపటి విజయాలకు ఐక్యతే బలం.ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం ప్రతి సీపీఎస్ ఉద్యోగి విజయవాడకు తరలిరావాలి" అని డా. ఎం.రవికుమార్ పిలుపునిచ్చారు.

# అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్

**ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు**

**ఎంపీఎస్‌లో ఘనంగా రక్షా బంధన్**






**మండపేట మండలం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** రక్షా బంధన్ అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు అన్నారు. రాఖీ పండుగ వేడుకలను ఎంపీఎస్ స్కూల్, కాలేజ్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా స్నేహభావం, సోదర భావంతో మెలగాలన్నారు. అందరికీ సహాయం చేసే గుణం అలవర్చుకోవాలన్నారు. కుటుంబవ్యవస్థ, భారతీయ ఔన్నత్యం సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జీవితం రూపొందాలన్నారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులు భారతదేశ చరిత్రను అవగతం చేసుకోవాలన్నారు. కలసి ఉంటే కలదు సుఖం అన్న పెద్దలమాటను తూచాతప్పకుండా వ్యవహరించాలని అప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలనన్నారు. అనంతరం తరగతివారీగా విద్యార్థులు రాఖీ కట్టారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్ స్కూల్ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ వల్లూరి చిన్నారావు, కాలేజ్ ప్రిన్సిపల్ దేవళ్ళ సాయి గంగాధర్ రావు, స్కూల్ ఏవో లు పుట్టా హేమాంబిక, మానేపల్లి కిరణ్మయి, దేవళ్ళ ప్రసన్న, తిరుశుల దత్తాత్రేయ, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
శనివారం, 29 ఆగస్టు 2026
www.viswamvoice.com



# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక.. రాఖీ పండుగ

## రక్షణ, ప్రేమ, ఆప్యాయతలకు ప్రతిరూపంగా రాఖీ.. తరతరాలుగా కొనసాగుతున్న పవిత్ర బంధం

**గోకవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు, ఆప్యాయతలకు, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను దేశవ్యాప్తంగా ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. శ్రావణ పౌర్ణమి రోజున నిర్వహించే ఈ పండుగలో సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అభివృద్ధిని కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా నిలుస్తామని, కష్టసుఖాల్లో తోడుంటామని సంకల్పిస్తారు.

**రాఖీ అంటే ఏమిటి?**

'రక్షా బంధన్' అనే పదానికి 'రక్షణకు సంబంధించిన బంధం' అనే అర్థం ఉంది. ప్రేమతో కట్టే చిన్న రాఖీ దారం కేవలం ఒక అలంకారం కాదు.. ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమ, విశ్వాసం, బాధ్యతలకు ప్రతీక. సంప్రదాయంగా సోదరి సోదరుడి నుదుట తిలకం పెట్టి, హారతి ఇచ్చి, అతని మణికట్టుకు రాఖీ కడుతుంది. అనంతరం సోదరుడు ఆమెకు కానుక అందించి తన అండగా ఉంటానని హామీ ఇస్తాడు.

**రాఖీ పండుగ ఎందుకు వచ్చింది?**

రక్షాబంధన్‌కు సంబంధించి అనేక పౌరాణిక కథలు, సంప్రదాయ విశ్వాసాలు ఉన్నాయి. వాటిలో శ్రీకృష్ణుడు-ద్రౌపది కథ అత్యంత ప్రాచుర్యం పొందింది. శ్రీకృష్ణుడి వేలికి గాయం కావడంతో రక్తం కారుతుండగా, ద్రౌపది తన చీరలోని కొంత వస్త్రాన్ని చింపి ఆయన వేలికి కట్టిందని పురాణ కథనం. ద్రౌపది చూపిన ఆప్యాయతకు స్పందించిన శ్రీకృష్ణుడు ఆమెను ఎల్లప్పుడూ రక్షిస్తానని వాగ్దానం చేశాడని చెబుతారు. ఈ కథను



రక్షాబంధన్‌లోని ప్రేమ, రక్షణ భావానికి ప్రతీకగా సంప్రదాయంగా చెబుతారు. మరో ప్రసిద్ధ కథ ఇంద్రుడు-ఇంద్రాణికి సంబంధించినది. దేవతలు, రాక్షసుల మధ్య యుద్ధంలో ఇంద్రుడు కష్టాల్లో ఉన్న సమయంలో ఇంద్రాణి పవిత్ర రక్షాసూత్రాన్ని ఆయన చేతికి కట్టిందని, ఆ రక్షాసూత్రం అనంతరం ఇంద్రుడికి విజయాన్ని అందించిందని భవిష్య పురాణం ఆధారంగా చెప్పే సంప్రదాయం ఉంది. అలాగే మహాలక్ష్మి-రాజా బలికి సంబంధించిన కథ కూడా రక్షాబంధన్ సంప్రదాయంలో ప్రముఖంగా చెప్పబడుతుంది. మహాలక్ష్మి రాజా బలికి రక్షాసూత్రం కట్టి సోదరుడిగా స్వీకరించిందని, అనంతరం విష్ణుమూర్తిని వైకుంఠానికి తీసుకెళ్లేందుకు బలి అంగీకరించాడని పురాణ కథనం.

**అన్నాచెల్లెళ్ల బంధమే కాదు.. మానవీయ బంధానికి ప్రతీక**

కాలానుగుణంగా రాఖీ పండుగ అర్థం కూడా విస్తరించింది. ఇది కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య బంధంగా కాకుండా ప్రేమ, గౌరవం, పరస్పర బాధ్యత, సహకారం, మానవత్వానికి ప్రతీకగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సమాజంలోని ఇతరుల మధ్య కూడా ప్రేమాభిమానాలను పెంపొందించే పండుగగా రక్షాబంధన్ నిలుస్తోంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా 2026 రక్షాబంధన్ సందర్భంగా ఈ పండుగ కుటుంబాలు, స్నేహితులు, సమాజంలో పరస్పర విశ్వాసం, సున్నితత్వం, సహకారాన్ని బలపరచాలని సందేశమిచ్చారు.

**రాఖీ దారంలో దాగిన బంధం**

రాఖీ దారం ఎంత చిన్నదైనా.. అందులో దాగి ఉన్న భావం ఎంతో గొప్పది. చిన్ననాటి అల్లరి నుంచి జీవితంలోని కష్టసుఖాల వరకు అన్నాచెల్లెళ్ల బంధం ఎన్నో జ్ఞాపకాలను మోస్తుంది. పెళ్లిళ్లు, ఉద్యోగాలు, దూర ప్రాంతాల్లో నివాసం వంటి కారణాలతో దూరంగా ఉన్న సోదరులు, సోదరీమణులు సైతం ఈ రోజున ఒకరినొకరు గుర్తుచేసుకుంటారు. దూరాన్ని తగ్గించి అనుబంధాన్ని మరింత బలపరిచే రోజుగా రాఖీ పండుగ నిలుస్తోంది.

**బహుమతులకంటే బంధమే ముఖ్యం**

ప్రస్తుత కాలంలో రాఖీ పండుగ సందర్భంగా ఖరీదైన బహుమతులు, ప్రత్యేకమైన రాఖీలు, ఆన్‌లైన్ కానుకలు అందుబాటులోకి వచ్చినా.. ఈ పండుగ అసలు సందేశం మాత్రం 'బహుమతి కాదు.. బంధమే గొప్పది' అన్నదే. సోదరుడు సోదరీమణికి అండగా ఉండటం, సోదరి సోదరుడి క్షేమాన్ని కోరుకోవడం ద్వారా కుటుంబ బంధాలు మరింత బలపడతాయి. అందుకే రాఖీ కేవలం చేతికి కట్టే దారం కాదు.. జీవితాంతం నిలిచే ప్రేమకు, నమ్మకానికి, ఆప్యాయతకు, పరస్పర రక్షణకు ప్రతీక.

### కోటి బుల్లెద్దుపాలెం వైఎస్ఆర్సిపి
# గ్రామ కమిటీ అధ్యక్షులుగా అడపా, మోదుకూరి



**కోరుకొండ, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం కోటి వైయ స్సార్సీపి గ్రామ అధ్యక్షుడిగా అడపా శివనాగును నియమించినట్లు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ స్టూడెంట్ విభాగానికి సీతా వెంకట దుర్గారావు, యువజన విభాగానికి అడపా నరసింహనాయుడు, మహిళా విభాగానికి గురుజ ఝాన్సీ, సోషల్ మీడియా దూలం మణికంఠ, ఐటీ విభాగానికి అడపా వంశీకృష్ణ, ప్రచార విభాగానికి ఉల్లి వీరవెంకట కృష్ణ, రైతు విభాగానికి అడపా వీరబాబు, వాలంటీర్ విభాగానికి అడపా నాగదేవి, ఎస్సీ మాల సామాజిక వర్గ విభాగానికి పినిపే సూర్యచంద్ర, ఎస్సీ మాదిగ విభాగానికి టి రాజారత్నం, బీసీ విభాగానికి రేజర్ల శ్రీను, క్రిస్టియన్ మైనారిటీ విభాగానికి వేశీకపాటి సుజాతకుమారిలను నియమించమన్నారు.బొల్లెద్దుపాలెం గ్రామ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడిగా మోదుకూరి విజయ్, విద్యార్థి విభాగానికి మద్దా సుధీర్ కుమార్, విద్యార్థి విభాగానికి మోదుకూరి ప్రసాద్, మహిళా విభాగానికి బరుకు సునీత, సోషల్ మీడియా అధ్యక్షుడిగా బరుకుబోసు ఐటీ విభాగం అధ్యక్షుడిగా కంచుబోయిన మధు మురళీకృష్ణ, ప్రచార విభాగానికి యడవల్లి అనిల్, రైతు విభాగానికి మోదుకూరి సుబ్రహ్మణ్యం వాలంటీర్ విభాగానికి మోదుకూరి వెంకట శివ ఎస్సీ మాల సామాజిక వర్గ విభాగానికి కర్రీ ఆనంద్ లను నియమించినట్లు రాజా తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు జక్కంపూడి రాజా, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# స్వర్ణాంధ్రలో సుమన్ జన్మదిన వేడుకలు

### సుమన్‌తో మూడు దశాబ్దాలు అనుబంధం



**రాజమహేంద్రవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ సినీ నటుడు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సలహాదారు సుమన్ పుట్టినరోజు వేడుకలు స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ జన్మదిన కేకును వృద్ధులతో కలిసి స్వర్ణాంధ్ర రాంబాబు కట్ చేసి వృద్ధులకు తినిపించారు. తదనంతరం సుమారు 150మంది వృద్ధులకు దుస్తులు బహుకరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు దారపు నాగిరెడ్డి, హెల్పింగ్ హాండ్స్ గ్రూపు అడ్మిన్ అనూప్ కుమార్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రారంభం నాటి నుండి మూడు దశాబ్దాల పాటు సినీ నటుడు సుమన్ అందించిన సహకారం సమస్త కి ఎంతగానో ఉపకరించిందన్నారు. సుమన్ గొప్ప మానవతావాదని పేద ధనిక అనే బేధం లేకుండా అందరితో స్నేహంగా ఉంటారని రాంబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ శెట్టిబలిజ సంఘం రాష్ట్ర నాయకులు మార్గాన్ని చంటిబాబు, రేలంగి శేఖర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం స్థాపన లోను నిర్మాణ నిర్వహణలోనూ సుమన్ పాత్ర ప్రశంసనీయమైనదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు దారపు నాగిరెడ్డి ప్రస్తుతించారు. మార్గాన్ని చంటిబాబు మాట్లాడుతూ సుమన్ 170 ఎకరాల భూమిని సైనికుల సహాయార్థం అందించడం గొప్ప మనసును చాటుకుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది హరికృష్ణ, మీరా కుమారి ,దివ్య , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వేంకటేశ్వర స్వామి చతుర్ధశ వార్షికోత్సవం

### స్వామి వారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ వేంకటేశ్వరా ఆనం కళాకేంద్రం ఆవరణలో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం చతుర్దశ (14వ) వార్షిక బ్రహ్మోత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనంతో ప్రారంభించి కలశముల పూర్వక స్నపన తిరుమంజనం, విశ్వశాంతి కై (పూర్ణాభిషేకం) అగ్ని మధనం, అగ్ని ప్రతిష్ఠాపన, లక్ష్మీ వెంకటేశ్వర మూలమంత్ర హోమం, దాతాదిమూల హోమం, మహా పూర్ణాహుతి అనంతరం వార్షిక కళ్యాణోత్సవం నిర్వహించారు. డిఇ కాసా సత్యనారాయణ, నాగజ్యోతి దంపతుల చేతుల మీదుగా వేద పండితులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సౌభాగ్య లక్ష్మీ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ముత్తైదువులచే ఉచిత సామూహిక లక్ష్మీ కుంకుమ పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 5 వేల మంది భక్తులకు భారీ అన్న సమాధానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వాడపల్లి శ్రీనివాసాచార్యులు, వారి కుమారుడు గణపతాచార్యులుచే భక్తుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి మందిర నిర్వహణ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కూర్మదాసు ప్రభాకరరావు, సభ్యులు వి.ఎస్.ఎస్.కృష్ణకుమార్, వాకచర్ల కృష్ణ, పెదిరెడ్ల శ్రీనివాస్ పర్యవేక్షించారు. మాజీ కార్పొరేటర్ ఎ.వి. రమణ, నందూరి సుబ్బారావు, మెట్ల ఏసుపాదం, దూర్వాసుల సత్యనారాయణ, గుదే రఘునరేష్, గారపాటి సూర్యనారాయణ, చుండూరి యోగనరసింహరాజు, నీలం గణపతి, రఘుపాత్రుని సాయిబాబ, సోము సాయి, చక్కా వెంకటేశ్వరరావు, పిచ్చుక అప్పారావు, కట్టా వెంకటేష్, పెరుమాళ్ళు సత్యనారాయణ, సబ్బిశెట్టి రాంబాబు, గాదంశెట్టి వెంకటేశ్వర్లు, రఘుపాత్రుని బాజ్జీపట్నాయక్, గోపాలకృష్ణ ఘోమ్రా, ఉదత్తు ఉషారాణి, సత్తి అలివేలు మంగతాయారు, పూసర్ల వెంకట దుర్గమ్మ, నాగమణి, భక్త బృందం శ్రీవారి సేవలో పాల్గొన్నారు.

### జిల్లా బిజెపి కార్యాలయంలో
# 'జనతా వారధి'

### పలు అంశాలపై వచ్చిన విజ్ఞాపనలు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురగంటి సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రోడ్లు అభివృద్ధి, వికలాంగుల త్రి చక్ర వాహనాలు, ప్రభుత్వ పింఛను, తదితర సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని, సెప్టెంబర్ రెండవ వారంలో ప్రభుత్వ పింఛన్లకు అందరూ దరఖాస్తు చేసుకునే విధంగా కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని తెలియజేశారు. ఈరోజు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. జనతా వారధి జిల్లా జిల్లా కన్వీనర్ ఎం ఎస్ ఆర్ కె రాజు, కో కన్వీనర్ యానాపు ఏసు, బండి సత్య ప్రసాద్, స్వామి సూర్య కిరణ్ నాయకులు పాల్గొన్నా రు.

# జక్కంపూడి ఆధ్వర్యంలో వైభవంగా సౌభాగ్య లక్ష్మీదేవివ్రతం



### ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**కోరుకొండ, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండలో వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా స్వగృహం వద్ద జక్కంపూడి రాజా రాజశ్రీ దంపతుల ఆధ్వర్యంలో సౌభాగ్య లక్ష్మీదేవివ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం,రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జక్కంపూడి దంపతుల ఆధ్వర్యంలో సౌభాగ్య లక్ష్మీదేవి వ్రతం సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా సౌభాగ్య లక్ష్మీదేవిని గాజులు, చీరలు, వివిధ ఫలపుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, రాఖీలను సమర్పించి వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజానగరం నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చి సౌభాగ్య లక్ష్మీదేవి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలందరికీ జక్కంపూడి రాజా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కేంద్రకమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనకు పి4 కార్యక్రమం వేగవంతం చేయాలి



**నిడదవోలు, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గంలో పి4 కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి పేద కుటుంబాల అవసరాలను గుర్తించి పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. శుక్రవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో పి4 పురోగతిపై చర్చించారు. నిడదవోలులో కుటుంబాల అవసరాల గుర్తింపు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పరిష్కార చర్యలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, జీవనోపాధి కార్యక్రమాలపై యంగ్ ప్రొఫెషనల్ సుధీర్‌కుమార్ వివరించారు. పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఒక్కో కుటుంబానికి ఒక్కో ఉపాధి అవకాశాన్ని కల్పించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య సదుపాయాలు, ఆరోగ్య కేంద్రాలకు స్థలాలు, కూరగాయల సాగు, ఆహార శుద్ధి పరిశ్రమలపై శిక్షణ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. యువతకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పి4 కింద గుర్తించిన కుటుంబాలు, సమాజ అవసరాలను శాఖల సమన్వయంతో వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, మహిళా సాధికారత, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యంతో పి4ను అనుసంధానం చేయాలని సూచించారు. దాతలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విస్తరించాలని తెలిపారు.

# ఎవరి ఆస్తులు ఎన్ని ఉన్నాయో రుజువుకి సిద్ధం

### రాజకీయాల్లో వచ్చి ఆస్తులు అమ్ముకున్నారనడం హాస్యాస్పంధం - టిడ్కోలో నరకం చూస్తున్నారు
### టిడ్కో రుణాల మాఫీ హామీ మర్చిపోయారా : ఎమ్మెల్సీ తోట

**మండపేట టౌన్, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** తన తాత తండ్రి ఆస్తులు అమ్ముకొని రాజకీయాలు చేస్తున్నానని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చెప్పడం ప్రజల చెవిలో పువ్వులు పెద్దడమె నని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు.మండపేట వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల చెవిలో పువ్వులు పెట్టకండన్నారు.రాజకీయాల్లో వచ్చి ఆస్తులు అమ్ముకున్నారనడం హాస్యాస్పంధం గా ఉందన్నారు.మట్టి గ్రావెల్,ఇసుక దోపిడీ తో వేగుళ్ళ జోగేశ్వరరావు ఆస్తులు కూడగట్టారని ఆరోపించారు. ఈనాడు, పచ్చ మీడియా సైతం ఇసుకాసురుడు అనే టైటిల్ ఇచ్చిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు.తన ఆస్తులు వేగుళ్ళ ఆస్తులు ఎన్నొన్నాయో రుజువు కు సిద్ధం గా ఉన్నానని సవాల్ చేశారు. తనకు హైదరాబాద్, బెంగుళూరు, అమరావతి, వైజాగ్ లలో ఆస్తులు ఉన్నాయని చెబుతున్నారని ఉన్నట్లు రుజువు చేస్తే వాటిని వేగుళ్ళ పేరిట రాసిస్తానని స్పష్టం చేశారు. పెద్ద కాల్వ నిర్వాసితుల ఉసురు ఊరికే పోదనీ పేర్కొన్నారు. టిడ్కో లో రికార్డు స్థాయిలో ,6 వేల మంది కి అపార్ట్మెంట్ లు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం కాదని అక్కడ కనీసం రెండు వేల మంది నివసిస్తున్నట్లు నిరూపిస్తే వేగుళ్ళ ఏం చెబితే అది చేసేందుకు తాను సిద్ధమన్నారు. అక్కడ ప్రజలు నరకం చూస్తున్నారనీ విమర్శించారు. ఎన్నికల టిడ్కో రుణాల మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు గాలికి వదిలేశారనీ దుయ్యబట్టారు. కొన్ని దశాబ్దాలుగా మండపేట పెద్ద కాలువ వంతెన పక్కన ఉంటున్న నిరుపేదల ఇళ్లను వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రభుత్వ సహకారంతో కూల్చేసిన విషయాన్ని ఈ రాష్ట్ర మొత్తం ప్రజలు గమనించారని తోట అన్నారు. వేగుళ్ళ జోగేశ్వరరావు సత్య దూరమైన అనేక విషయాలు మాట్లాడారని పేర్కొన్నారు.అభివృద్ధిని అడ్డుకుంటున్నామని చెప్పడాన్ని ఖండించారు. పుష్కరాల పేరుతో పేదలకు నిలువు నీడ లేకుండా చేశారని పేర్కొన్నారు.పుష్కరాలు కాలువలకు కాదన్నారు. వేగుళ్ళ జోగేశ్వరరావు కు ఎన్ని ఎకరాలు ఉన్న మొత్తానికి ఉన్నదని ఒప్పుకున్నందుకు సంతోషమన్నారు. మూడు పుష్కరాల నుంచి ఉంటున్న వారిని అక్కడ నుండి తొలగించాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. వెనుక ఉన్న పొలాలను లేఅవుట్లుగా మార్చే ఉద్దేశం లేకపోతే ఏ కారణం చేత ఆ పేదవాళ్ళ ఇల్లును తొలగించారని అడిగారు. ప్రశాంతంగా ఉండే మండపేటలో తానేదో అరాచకాలు చేస్తున్నట్లు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ప్రశాంతంగా ఉన్నప్పుడు 200 మంది పోలీసులతో అర్ధరాత్రి రెండు, మూడు గంటలకు వచ్చి తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అదే పగలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. చెప్పేవన్నీ నిజాలని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అభివృద్ధికి తాను అడ్డుకుంటున్నానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత 15 సంవత్సరాలుగా కాలవలపై వేలాడుతున్న బ్రిడ్జిలు ఎందుకు కట్టించలేదని అడిగారు. ముందు మూడు ఎకరాలు ఆయనవి కాదా, మిగిలినవన్నీ అందులో భాగమే కదా అన్నారు. మండపేటలో ఓం సిటీ అని కొమ్ము రాంబాబు రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తే రెండు నుంచి మూడు కోట్లకు విలువ చేసే భూములను కోటి పదిలక్షలకు కొన్న వాళ్లకు ఇంకా బకాయిలు చెల్లించలేదని,



తిప్పుకుంటున్నారని చెప్పడం సరికాదన్నారు. అదే వాస్తవమైతే ప్రస్తుత ఎమ్మెల్యే ఆయనే కదా, ఆయన ఉండి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అందులో కొమ్ము రాంబాబు ఆయన కు ఏమైనా వాటా ఇచ్చారా అని ప్రశ్నించారు. వాటా ఇవ్వకపోతే నష్టపోయిన బాధ్యులకు అండగా నిలబడాలి కదా అని పేర్కొన్నారు. వాళ్లకు న్యాయం చేయవలసిన బాధ్యత కూడా ఎమ్మెల్యే వేగుళ్ళ పై ఉందని అన్నారు. ఇలాంటి చవకబారు రాజకీయాలు, బురదజల్లే కార్యక్రమాలు వదులుకుంటే మంచిదన్నారు. రాజకీయాలు చేయడం కోసం గుమ్మిలేరులో రియల్ ఎస్టేట్ వేసి అమ్ముకుని రాజకీయాలు చేశాననడం సరికాదన్నారు. ప్రజల చెవిలో పువ్వులు పెడితే నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మాట్లాడేటప్పుడు సిగ్గు బిడియం వదిలేసి మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. స్వామి మాలలో ఉన్నారని ఆత్మ పరిశీలన చేసుకుని మాట్లాడాలని హితవు పలికారు. తనకున్న ఆస్తులు జోగేశ్వరరావుకున్న ఆస్తులు పై సవాలు విసిరారని గుర్తు చేశారు. అయితే అదే సవాలుకి కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ప్రెస్ మీట్ వేగుళ్ళ ఇంటి దగ్గర పెట్టిన , మున్సిపల్ ఆఫీస్లో పెట్టినా అక్కడికి వస్తానని తెలిపారు. తనకు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయో వివరాలు తెలిపితే అవన్నీ వేగుళ్ళ కు రాసి ఇస్తానన్నారు. రాజకీయాలు మాట్లాడాలి తప్ప ప్రజలను తప్పుదారి పట్టించడం సరికాదన్నారు. పేదవారు కడుపు మండి కడుపు మంటతో మాట్లాడారన్నారు. ఇక్కడ ఇల్లు తీసేసి ఎక్కడో టిట్కోలో ఇచ్చేయడం సరికాదని, అక్కడ ఉండలేక నరకం అనుభవిస్తున్నారన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా తెలుగుదేశం ప్రభుత్వంలో కట్టిన 6000 టిడ్కో ఇళ్లలో కనీసం ఇప్పుడు 2000 మంది ఉంటే మీరు ఏది చెప్తే అది చేస్తానని తెలిపారు. అక్కడ ప్రజలు దిక్కుతోచని పరిస్థితుల్లో నివాసం ఉంటున్నారే తప్ప ఉన్నవారందరూ ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారన్నారు. ఎలక్షన్ ముందు బ్యాంకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడుస్తుందని, లోన్లు రద్దు చేయించారని ప్రశ్నించారు. చేసింది ఏమీ లేక అభివృద్ధి అడ్డుకుంటున్నామని అబద్ధపు మాటలు చెప్పడం సరికాదన్నారు. వేరే విధంగా మాట్లాడేవాడినని మీరు మాలలో ఉన్నందున తగ్గించుకొని మాట్లాడుతున్నానన్నారు. మాలలో ఉండి ఆత్మసాక్షితో మాట్లాడాలన్నారు. రాజశేఖర్ రెడ్డి పేదల కోసం సేకరించిన స్థలాలను ఇళ్లస్థలాలుగా ఇవ్వడం జరిగిందని, వారసులు ఉంటే పైన పోర్షన్ కట్టుకుని సంతోషంగా ఉంటున్నారన్నారు. ఈ టిట్కో ఇళ్లలో ఒకరిపై ఒకరిని ఎక్కించి, ఎవరు సుఖంగా లేరన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి కూడా ఇళ్ల స్థలాలను ఇచ్చి ప్రజల మెప్పు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కిసాన్ సెల్ కార్యదర్శి రెడ్డి రాజబాబు, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, టౌన్ వైసిపి కన్వీనర్ పిల్లి శ్రీను, మందపల్లి రవి, అడబాల బాబ్జి, మెందు బాపిరాజు, సిరిపురం శ్రీనివాస్, పోతుల ప్రసాద్, కోళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేగుళ్ళకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మకుమారీలు



**మండపేట టౌన్, ఆగస్టు 28, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు బ్రహ్మకుమారీలు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట పట్టణానికి చెందిన బ్రహ్మకుమారీలు శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేగుళ్ళకు రాఖీ కట్టి, ఈశ్వరీయ ఆశీస్సులు అందిస్తూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు సమాజంలో ఆధ్యాత్మికతను, ప్రశాంతతను పెంపొందించేందుకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. మానవీయ విలువల పరిరక్షణకు, సోదరభావ వ్యాప్తికి వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

ఈ సినిమా చేసి తప్పు చేశా..

# నా జీవితంలో తీసుకున్న చెత్త నిర్ణయం ఇదే : నయనతార



స్టార్ హీరోయిన్లలో నయనతార ఒకరు. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే సినీరంగంలోకి అడుగుపెట్టి స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తుంది. హీరోలకు మించి స్టార్ డమ్ సంపాదించుకుంది. నయన్ తాజాగా యష్ హీరోగా నటించిన టాక్సిక్ సినిమాలో నటించింది నయనతార. సినిమా ఇండస్ట్రీలో తిరుగులేని క్రేజ్ సొంతం చేసుకున్న అందాలభామల్లో లేడీ సూపర్ స్టార్ నయనతార ఒకరు. ఈ ముద్దుగుమ్మ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. స్టార్ హీరోలకు సమానంగా రెమ్యునరేషన్‌తో పాటు క్రేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది. కెరీర్ బిగినింగ్ లో చిన్న చిన్న రోల్స్, సెకండ్ హీరోయిన్ గా చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న నయన్. ఆతర్వాత హీరోయిన్ గా మారి హిట్స్ మీద హిట్స్ అందుకుంది. తాజాగా కన్నడ స్టార్ హీరో యష్ నటించిన టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా డివైడ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఇప్పుడు థియేటర్స్ లో టాక్సిక్ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే నయనతార గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ హీరో సినిమాలో నటించి తప్పు చేశానని నయన్ షాకింగ్ కామెంట్స్ చేసింది. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో స్టార్ హీరోలతో కలిసి నటించింది నయన్. కానీ సినిమాల కంటే ఎక్కువగా పర్సనల్ విషయాలతోనే వార్తలలో నిలుస్తుంది. గతంలో ఆమె ప్రేమ వ్యవహారాలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే ఓఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నా జీవితంలో నేను ఓ సినిమాకు ఒకే చేసి తప్పు చేశా అని సంచలన కామెంట్స్ చేసింది నయనతార. ఇంతకూ నయన్ చెప్పింది ఏ సినిమా గురించో తెలుసా.? అయితే తాను చేసిన సినిమాల్లో, తీసుకున్న నిర్ణయాల్లో అత్యంత చెత్త డెసిషన్ గజినీ సినిమా చేయడమే అని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 2005లో ఏఆర్ మురగదాస్ తెరకెక్కించిన గజినీ చిత్రంలో సూర్య హీరోగా నటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆసిన్ ప్రధాన కథానాయికగా నటించగా.. నయన్ సెకండ్ హీరోయిన్ గా కనిపించింది. అయితే ఈ సినిమాలో తనను చెడుగా చూపించారని.. హీరోయిన్ పాత్రకు దగ్గరగా ఉందని చెప్పి.. అలా చూపించలేదని అన్నారు. అది తనను ఎంతో బాధించిందని.. ఆసినిమా చేసి తప్పు చేశానని గతంలో చెప్పుకొచ్చింది. ఈ కిలేమెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.

ఓయమ్మో..! ఓరినాయనో..!!

# ఇవెక్కడి హారర్ సిరీస్‌లు రా అయ్యా..!



ప్రస్తుతం ఓటీటీ సినీ ప్రపంచంలో హారర్ సినిమాలు, సిరీస్‌లు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ కలిగి ఉంటాయి. సాధారణ దెయ్యాల కథలకు భిన్నంగా మానవ మనస్సును పీడించే భయం తెరపైకి వచ్చినప్పుడు ప్రేక్షకులు వణికిపోతారు. ప్రస్తుతం కొన్ని హారర్ వెబ్ సిరీస్ లు ఆడియన్స్ ను తెగ ఆకట్టుకుంటున్నాయి. హారర్ సినిమాలకు క్రేజ్ ఎప్పుడూ తగ్గదు. ఇలాంటి సినిమాలను చూడటానికి ఆడియన్స్ ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటారు. ఇప్పటికే హారర్ జోనర్ లో ఎన్నో రకాల సినిమాలు వచ్చాయి. రీసెంట్ గా కొరియన్ కనకరాజు అనే సినిమా కూడా థియేటర్స్ లో ప్రేక్షకులను భయపెడుతూ నవ్వించింది. అలాగే ఓటీటీల్లోనూ సినిమాలు దూసుకుపోతున్నాయి. వాటిలో హారర్ సినిమాలు, సిరీస్ లు ముందు వరసలో ఉంటున్నాయి. చూసేందుకు ఇప్పుడు జనాలు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఓటీటీలో ఈ జానర్ చిత్రాలకు ఎక్కువగా ఆదరణ లభిస్తుంది. అందుకే మేకర్స్ ఈ జానర్ సినిమాలు, వెబ్ సిరీస్ తెరకెక్కించేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఇప్పుడు జనాలు ఎక్కువగా భయానక కథలు, దెయ్యాలు, ఉత్కంఠభరితమైన కంటెంట్‌ను ఇష్టపడుతున్నారు. అలాంటి వారికోసమే ఇప్పుడు ఈ భయానక సిరీస్ గురించి తెలుసుకుందాం. ఈ వెబ్ సిరీస్ పేరు రస్కిన్ బాండ్ రాసిన పార్చుయిూ: ఘోస్ట్ స్టోరీస్. ఇది ప్రముఖ ఓటీటీ ప్లాట్ జీ5లో ప్రసారమయ్యే ఒక హారర్-థ్రిల్లర్ వెబ్ సిరీస్. దీనిని ప్రముఖ రచయిత రస్కిన్ బాండ్ రాసిన దెయ్యాల కథల ఆధారంగా రూపొందించబడింది. ఈ సిరీస్‌లో 12 ఎపిసోడ్‌లు ఉన్నాయి. ఒక్కో ఎపిసోడ్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటాయి. దీనికి IMDbలో 5.8 రేటింగ్ ఉంది. అలాగే అంధర్ మాయ అనేది జీ5లో స్ట్రీమింగ్ అవుతున్న మరాఠీ హర్రర్ వెబ్-సిరీస్. ప్రతి సంవత్సరం కొంకణ్‌లోని పాత భవనంలో సమావేశమయ్యే ఖాటు కుటుంబం గురించి ఉంటుంది. అందులో బహిర్గతం కాని రహస్యాలు, వారసత్వంగా వచ్చిన శాపాలు, ప్రాణాంతక సంఘటనలు ఉన్నాయి. దీనికి IMDbలో 6.5 రేటింగ్ ఉంది. ఇవే కాకుండా.. IMDbలో 7 రేటింగ్ ఉన్న మూఢనమ్మకాల సిరీస్ 'దాయన్'. నటి టిన్యా దత్తా , మోహిత్ మల్హోత్రా రూపొందించిన ఈ సిరీస్, చేతబడి, మంత్రగత్తెలు, కుటుంబాల మధ్య చీకటి సంబంధాలను తెలియజేస్తుంది. జీ5లో అందుబాటులో ఉన్న ఈ సిరీస్, కథాంశంతో థ్రిల్, భయాన్ని కలిగిస్తుంది.

# బ్లైండ్ ఫౌండేషన్ అమ్మాయిలతో రాఖీ వేడుకలు జరుపుకున్న టాలీవుడ్ హీరో..



టాలీవుడ్ హీరో సంజోష్ మంచి మనసు చాటుకున్నారు. రాఖీ పండగ సందర్భంగా శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్ కు చెందిన అమ్మాయిలతో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఉపయోగపడే గ్యాస్ స్టవ్ బహుకరించి అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఇకపై వారందూర తన చెల్లెళ్లని.. వారికి ఏ అవసరం వచ్చినా అన్నయ్యగా తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. టాలీవుడ్ హీరో సంజోష్ గురించి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. లెజండ్రీ యాక్టర్ రాజేంద్రప్రసాద్ నటించిన బేవర్స్ సినిమాలో హీరోగా నటించారు సంజోష్. నటనతో మంచి మార్కులు కొట్టేసిన సంజోష్.. ఇప్పుడు మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. రీల్ లోనే కాకుండా రియల్ లైఫ్ లోనూ హీరో అనిపించుకున్నారు. శుక్రవారం రాఖీ పండగ సందర్భంగా హైదరాబాద్ నాగోల్ లోని శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్ కు చెందిన అమ్మాయిలతో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఉపయోగపడే గ్యాస్ స్టవ్ బహుకరించారు. అలాగే అందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. సంజోష్ మాట్లాడుతూ "ఇకపై మీరందరూ నా చెల్లెళ్లే. మీకు ఏ అవసరం వచ్చినా నా వంతు అండగా ఉంటాను" అంటూ వారికి మాట ఇచ్చారు. ఇప్పటికే శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్ అమ్మాయిల కోసం రెండు సార్లు భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఫ్రిజ్ డొనేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఇది మాత్రమే కాదు. ఇప్పటివరకు 250 మందికి మొబైల్ ఐ క్యాంప్స్ ద్వారా క్యాటరాక్ట్ సర్జరీలు, 118 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించారు. అలాగే 3 మంది విద్యార్థుల చదువు బాధ్యతను స్వయంగా తీసుకున్నారు. వరంగల్ నుంచి వచ్చి సినీ పరిశ్రమలో మంచి ఫ్యామిలీ కథలతో ప్రేక్షకులను అలరిస్తూనే.. తన వంతుగా సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో సేవా కార్యక్రమాలు చేస్తున్న హీరో సంజోష్‌ను అభినందించాల్సిందే. ఎలాంటి ఫిల్మ్ బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టిన సంజోష్.. ఒక్కో మెట్టు ఎక్కుతూ నటుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నారు. అలాగే ఇటు నిజ జీవితంలో తన వంతుగా సేవ కార్యక్రమాలు చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు సంజోష్.

అదే కొలంబో టెస్టులో

# కోహ్లీ ఉండుంటే.. ఫలితం మరోలా..: మహ్మద్ కైఫ్



ఒక్క రోజులో నాలుగు వికెట్లను తీయలేక ఇబ్బంది పడిన భారత బౌలర్లు శ్రీలంకతో రెండో టెస్టును డ్రా చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో పర్సంటేజీ కూడా తగ్గిపోయింది. ప్రత్యర్థికి ఫాలో ఆన్ ఇచ్చినా గిల్ సరైన వ్యూహాలను అమలు చేయలేదని విమర్శలు వచ్చాయి. లంక బ్యాటర్ సోనాల్ దినుషను అడ్డుకోవడంలో టీమ్‌ఇండియా విఫలమైందని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఆక్షేపించాడు. అదే విరాట్ కోహ్లీ అక్కడుంటే పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించాడు. "టెస్టు క్రికెట్ ఆడటం అందరికీ సూట్ కాదు బాస్.. ఇది సుదీర్ఘమైన ఫార్మాట్ గేమ్. బౌలింగ్ ఎటాక్‌ను కొనసాగిస్తూనే ఉండాలి. ఎందుకో.. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడుంటే తప్పకుండా భారత్ విజయం సాధించేదేమో అనిపించింది. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జట్టు సహచరుల్లో ఉత్సాహాన్ని నింపుతాడు. ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఉంటే చాలు ఫలితం దక్కుతుందని.. బంతి బాగా తిరుగుతుంది కాబట్టి వికెట్ వస్తుందనుకొని తేలిగ్గా తీసుకున్నట్టుగా అనిపిస్తోంది. మన ఎనర్జీ లెవల్స్ తగ్గుతున్నప్పుడు విరాట్ ఉండుంటే.. ప్రతి ఒక్కరినీ ఉత్సాహపరిచేవాడు. ప్రత్యర్థులపై మాటలతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోన్న సర్ఫరాజ్, యశస్వి జైస్వాల్‌ను ఇంకా ప్రోత్సహించేవాడు. సోనాల్‌నూ కోహ్లీ వెంటాడేవాడు. కానీ, ఈ జట్టులోని ఆటగాళ్లు మాత్రం కుమార వంటి లోయర్ ఆర్డర్ బ్యాటర్‌ను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం చూశాం" అని కైఫ్ అన్నాడు.

**ఒత్తిడి పడలేదు..**

"ఈ మ్యాచ్‌లో సోనాల్‌నే ఔట్ చేయాలి. అతడు చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. లాహిరు కుమారతో తమ భాషలో 'వాళ్ల ముఖాలు చూడు' అని భారత ప్లేయర్లను అంటున్నట్లుగా ఓ వీడియో చూశా. ఓ వైపు టెయిలెండర్లు మాత్రమే ఉన్నా.. సోనాల్ మాత్రం ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కనిపించాడు. మనవాళ్ల స్లెడ్జింగ్ అసలు అతడిపైనే జరిగినట్లు అనిపించలేదు. ఎంతసేపూ కుమార, ప్రభాత్ జయసూర్యనే లక్ష్యం చేసుకోవడం కనిపించింది. అలాగే, పెద్ద ప్లేయర్ అతడికి దగ్గరగా తిరుగుతూ మానసికంగానూ ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు. మొన్నటి వరకూ విరాట్ కోహ్లీ, రోహిత్, అశ్విన్, ధోని.. ఇలాంటి ప్లేయర్లను దగ్గరగా చూస్తే ప్రత్యర్థి కుర్రాళ్లు కాస్త కంగారు పడేవారు. ఒత్తిడి పెంచుకొనేవాళ్లు. ఎందుకో.. ఈసారి అలాంటి పరిస్థితిని మనం కోల్పోయామని అనిపించింది" అని కైఫ్ వెల్లడించాడు.

# ఇవిగో 'డ్రా' తాలూకు గుర్తులు.. పంత్



శ్రీలంక - భారత జట్ల మధ్య జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగిసినా.. అసలైన 'సుదీర్ఘ ఫార్మాట్' రుచి ఏంటో అభిమానులకు చూపించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 150 ఓవర్లకుపైగా భారత ఆటగాళ్లు ఫీల్డింగ్ చేశారు. లంక బ్యాటర్ సోనాల్ దినుషతోపాటు లోయర్ ఆర్డర్ దెబ్బకు టీమ్‌ఇండియా ఫీల్డర్లు బాగా అలసిపోయారు. అందుకు సంబంధించిన జ్ఞాపకాలను దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ పంచుకున్నారు.

**ఇదిగో నా టాటూ..**

శ్రీలంకతో రెండు టెస్టుల్లోనూ శతకాలు బాది ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు దేవదత్ పడిక్కల్. సాయి సుదర్శన్ స్థానంలో పడిక్కల్ వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చాడు. ఇటు ఫీల్డింగ్‌లోనూ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. గంటలతరబడి ఫీల్డింగ్ చేయడంతో తన వీపుపై సూర్యుడు 'టాటూ' వేశాడంటూ పేరు, జెర్సీ నంబర్ ఉన్న ఫొటోను షేర్ చేశాడు.

**అది నా గాయం..**

శ్రీలంకతో రెండో టెస్టులో గాయంతో ఒక దశలో రిషభ్ పంత్ ఒక రోజు మైదానంలోకే రాలేదు. అతడికి బదులు ధ్రువ్ జురెల్ బాధ్యతలను నిర్వర్తించాడు. బ్యాటింగ్ చేస్తుండగా లంక బౌలర్లు సంధించిన షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే క్రమంలో పంత్ చేతులు, భుజానికి గాయాలు అయ్యాయి. అయితే, హాఫ్ సెంచరీతో రాణించిన అతడు.. చివరి రోజున ఫీల్డ్‌లోకి దిగాడు. ఈ క్రమంలో తనకు అయిన గాయాన్ని చూపిస్తూ ఇన్‌స్టాలో ఫొటోలను షేర్ చేసుకున్నాడు.

మహిళల క్రికెట్‌లో అనయ బంగర్‌ను

# ఎలా ఆడిస్తారు?: కాప్ తీవ్ర అభ్యంతరం



అనయ బంగర్.. లింగ మార్పిడి చేయించుకుని అమ్మాయిగా మారిన ఓ అబ్బాయి. భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె. అంతకుముందు దేశవాళీలో సర్ఫరాజ్ ఖాన్, అభిషేక్ శర్మ వంటి యువ భారత ఆటగాళ్లతో కలిసి ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మహిళగా మారిన తర్వాత తన క్రికెట్ కలను నెరవేర్చుకొనేందుకు ఐసీసీపైనే పోరాటం చేసింది. అయితే, ఆస్ట్రేలియా క్రికెట్ సంఘం ఆమెకు మద్దతుగా నిలిచింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు అవకాశం ఇచ్చింది. కానీ, ఇప్పుడు అనయ అవకాశాలకు గండిపడేలా ఉంది. దానికి కారణం దక్షిణాఫ్రికా ప్లేయర్ మరిజెన్నె కాప్ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీగా పెట్టడం గమనార్హం. "ఇలాంటి నిర్ణయం అత్యంత దారుణం. అనుమతి ఇవ్వడానికి వీల్లేదు. ట్రాన్స్‌జెండర్ క్రికెటర్ మహిళల బిగ్‌బాష్‌ను ఆడేందుకు ఎలా వీలవుతుంది" అని కాప్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మార్చి 2027లో మొదలయ్యే మహిళల బిగ్‌బాష్‌లో ఆడతానని ఇటీవల అనయ ప్రకటించిన తర్వాత కాప్ ఈ మేరకు పోస్టు చేసింది. ఆసీస్ బోర్డు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తం చేసిన తొలి క్రికెటర్ కాప్. ఈ దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ అయిన ఆమె బిగ్‌బాష్‌లోనూ ఆడుతోంది.

**ఐసీసీ అనుమతి లేదు.. :** ఐసీసీ 2023 నుంచి అమలు చేస్తోన్న పాలసీ ప్రకారం.. ట్రాన్స్‌జెండర్ మహిళలకు అంతర్జాతీయ మహిళా క్రికెట్ ఆడేందుకు అనుమతి లేదు. కానీ, ఆస్ట్రేలియా దేశవాళీ నిబంధనలు ఇందుకు పూర్తిగా భిన్నం. కమ్యూనిటీ, ప్రిమియర్ క్రికెట్ ఆడేందుకు అనయకు అవకాశం కల్పించింది. అర్హత ప్రక్రియను అనుసరించే అనుమతి ఇచ్చినట్లు ఇటీవల ఓ ప్రకటనలో తెలియజేసింది. కాప్ విమర్శల నేపథ్యంలో.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి!

# 2027 వరల్డ్ కప్ గెలిచి రిటైర్ అవుతా..!




దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ 2027 వన్డే ప్రపంచకప్‌ను సొంతగడ్డపై గెలిచి కెరీర్‌కు ఘనంగా వీడ్కోలు పలకాలని కోరుకుంటున్నాడు. జట్టులో చోటు ఖాయమని చెప్పలేమని, అప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన చేయడమే తన లక్ష్యమని తెలిపాడు. ఒత్తిడిలో సాధించిన రెండు సెంచరీలు తన కెరీర్‌లో ప్రత్యేకమని మిల్లర్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా స్టార్ మిడిల్‌ఆర్డర్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ తన కెరీర్‌కు ప్రపంచకప్ విజయంతో ముగింపు పలకాలని బలమైన కోరికను వ్యక్తం చేశాడు. 2027లో స్వదేశంలో జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా తరఫున ఆడి, జట్టుకు ట్రోఫీ అందించడమే తన ప్రధాన లక్ష్యమని మిల్లర్ వెల్లడించాడు. 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనుంది. దక్షిణాఫ్రికా ఇప్పటివరకు వన్డే ప్రపంచకప్‌ను గెలవలేదు. 2023 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ వరకు వెళ్లిన ప్రొటీస్ జట్టు.. కోల్‌కతాలో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో 2027 ప్రపంచకప్ తనకు ఎంతో ప్రత్యేకమని మిల్లర్ చెప్పాడు. కెరీర్ చివరి దశలో ఒక ప్రపంచకప్ ట్రోఫీని అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. అయితే జట్టులో తన స్థానం ఇప్పుడే ఖాయమని చెప్పలేమని, అప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ జట్టులో చోటు సంపాదించడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. మిడిల్‌ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తూ క్లిష్ట పరిస్థితుల్లో మ్యాచ్‌లను ముగించడం తన కెరీర్‌లో అత్యంత గర్వకారణమైన అంశమని మిల్లర్ పేర్కొన్నాడు. ముఖ్యంగా లక్ష్య ఛేదనల్లో ఒత్తిడిని ఎదుర్కొంటూ మ్యాచ్‌ను ఫినిష్ చేయడం తనకు ఎంతో ఇష్టమని చెప్పాడు. ఈ నైపుణ్యాన్ని సాధించడానికి ఎన్నో సంవత్సరాల అనుభవం అవసరమైందని వెల్లడించాడు. ఇటీవల ది హండ్రెడ్ 2026లో సదరన్ బ్రేవ్ తరఫున మిల్లర్ ఎనిమిది మ్యాచ్‌ల్లో 166 పరుగులు చేశాడు. తన ఫామ్‌ను కొనసాగిస్తూ 2027 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోవాలని చూస్తున్నాడు. తన కెరీర్‌లో అత్యంత ఇష్టమైన ఐపీఎల్ జ్ఞాపకంగా 2022లో గుజరాత్ టైటాన్స్‌తో కలిసి సాధించిన టైటిల్ విజయాన్ని మిల్లర్ గుర్తుచేసుకున్నాడు. అలాగే ఒత్తిడిలో సాధించిన రెండు సెంచరీలను తన అత్యుత్తమ ఇన్నింగ్స్‌లుగా పేర్కొన్నాడు. ఆర్‌సీబీపై 101 పరుగులు, ఆస్ట్రేలియాపై డర్బన్‌లో సాధించిన 118 నాటౌట్ తనకు ఎప్పటికీ ప్రత్యేకమని చెప్పాడు. ఇప్పుడు ఆ అనుభవాన్నంతా ఉపయోగించి సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకు తొలి వన్డే ప్రపంచకప్ అందించాలనే కలతో మిల్లర్ ముందుకు సాగుతున్నాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com